http://www.agnidharanews.com

# అగ్నిధార

మంగళవారం 25 నవంబర్ 2025

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 8 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828


# దర్జాగా దందా...!



## అనుమతులు సున్న...!!

## అర్హత లేకున్నా " సృష్టి " స్తారు

## "అమ్మతనం" పేరుతో అక్రమ దందా..




**వైద్య వృత్తిని భ్రష్టు పట్టిస్తున్న కొందరు కేటుగాళ్లు.**
**నిబంధనలు పాటించని " బర్త్ " హాస్పిటల్స్.**
**అమాయకుల నుండి ఆర్థిక దోపిడీ.**
**దృష్టి సారించని వైద్యశాఖ అధికారులు.**

-3లో



వైద్య వృత్తి అంటే ప్రతి ఒక్కరికి గౌరవం వైద్యులు అంటే ప్రజలకు ప్రత్యక్షంగా కనిపించే దైవం డాక్టర్ కనబడగానే రెండు చేతుల దండం పెట్టేంత గౌరవం, నమ్మకం. కానీ ఆవృత్తిని కొందరు కేటుగాళ్లు భ్రష్టు పట్టిస్తున్నారు. అవసరాలతో, వచ్చే అమాయక, ప్రజలను బురడీ కొట్టించి,, వారి అవసరాలను ఆసరా చేసుకోని కొందరు డాక్టర్ల ముసుగులో ఆర్థిక దోపిడిదారులుగా, అవతార మెత్తుతున్నవారు, వైద్య వృత్తిలో కలుపు మొక్కలుగా తయారవుతున్నారు. కొన్ని ప్రైవేట్ హాస్పిటల్ లో ఆరోగ్యం బాగాలేక కర్మకాలీ కాలు పెడితే ఉన్న ఆస్తులు అమ్ముకొని బయటికి రావలసిన దుస్థితి దాపురించింది. మరోవైపు సంతాన లేమి సమస్యలతో బాధపడుతున్న వారి బాధ వర్ణన రహితం. మారుతున్న కాలమాన జీవన పరిస్థితుల వల్ల, లేట్ మ్యారేజీలు, పెళ్లయిన అనుకున్న సమయానికి సంతానం కలగకపోవడం వల్ల మానసికంగా ఇబ్బంది పడుతున్న దంపతులు నేడు ఎందరో ఉన్నారు.

# విద్యతోనే పేదల ఇంట్లో వెలుగులు

- కొడంగల్ ప్రజల 70 ఏళ్ల కల నెరవేరబోతుంది: సీఎం రేవంత్ రెడ్డి
- ఆడబిడ్డల ఆత్మగౌరవంతో బతికేలా ఉండాలి
- ప్రతి పేద తల్లి కళ్లల్లో ఆనందం చూడాలని సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాం
- మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం
- ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలకు తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యత ఇస్తుంది
- కొడంగల్ నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్రమలు సైతం ఏర్పాటు కాబోతున్నాయి
- త్వరలోనే సర్పంచ్ ఎన్నికలు రానన్నాయి
- రెండు, మూడు రోజుల్లో దానికి సంబంధించి నోటిఫికేషన్ వస్తుంది



కొడంగల్

విద్యతోనే పేదల ఇంట్లో వెలుగులు నిండుతాయన్నారు. అందుకే మీ బిడ్డలను ఉన్నత చదువులు చదివించడమే సీఎంగా తన ముందున్న టార్గెట్ అన్నారు. ప్రపంచంతో పోటీపడాలంటే ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రెండూ కీలకమని సీఎం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలందరికి సన్నబియ్యం ఇస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. త్వరలోనే సర్పంచ్ ఎన్నికలు రానన్నాయని రెండు, మూడు రోజుల్లో దానికి సంబంధించి నోటిఫికేషన్ వస్తుందన్నారు. అభివృద్ధిని అడ్డుకునే వాళ్లను ఎన్నుకోవద్దని, అభివృద్ధి చేసే వారికి అండగా నిలవాలని సీఎం రేవంత్ ప్రజలను కోరారు. కొడంగల్ లోని ప్రతి ఎకరాకు కృష్ణానది నీరు అందిస్తామని త్వరలోనే రూ.ఐదువేల కోట్లతో ఎడ్యుకేషనల్ క్యాంపస్ నిర్మించి కొడంగల్‌ను ఎడ్యుకేషనల్ హబ్ గా మార్చుతామని సీఎం రేవంత్ హామీ - మిగతా3లో



# బీసీలకు కాంగ్రెస్ చేస్తున్న ద్రోహాన్ని ఎండగడతాం

- తెలంగాణ బీసీలకు కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చేసిన అన్యాయాన్ని ఢిల్లీలో ఎండగడతాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే లోక్‌సభలో అపోజిషన్ లీడర్‌గా ఉన్న ఆయన వెంటనే ఈ అంశం పైన పార్లమెంటులో చర్చకు వచ్చేలా చూడాలి
- రానున్న పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ నుంచి ఎన్నికై ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు లోక్‌సభలో గళం లేవనెత్తాలి

హైదరాబాద్

బీసీ రిజర్వేషన్ల అంశంతో పాటు బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ద్రోహంపై ఆ పార్టీ తీరును ఎండగడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కి, అడుగడుగునా బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తామని అన్నారు. తెలంగాణ బీసీలకు కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చేసిన అన్యాయాన్ని ఢిల్లీలో ఎండగడతామని కేటీఆర్ తెలిపారు. తెలంగాణలో ఎలాంటి రిజర్వేషన్ల పెంపు - మిగతా3లో



# భారత్‌కు రష్యా బంపరాఫర్

- అమెరికా ఆంక్షలు..
- భారీ డిస్కౌంట్‌తో భారత్‌కు రష్యా చమురు
- నవంబర్ 21 నుంచి రష్యా సంస్థలపై అమెరికా ఆంక్షలు
- గత రెండేళ్లలో ఎన్నడూ లేనంత తగ్గింపుకు చమురు
- బ్యారెల్‌కు ఏడు డాలర్ల వరకు తగ్గింపు ధర




# సీజేఐ ప్రమాణస్వీకారానికి రాహుల్‌గాంధీ రాకపోవడం సిగ్గుచేటు

- సీజేఐ ప్రమాణస్వీకారానికి ప్రభుత్వం నుంచి అందరు ప్రముఖులు హాజరయ్యారు

# రాగల 48 గంటల్లో బంగాళాఖాతంలో తుపాను

హిందూ మహాసముద్రంలో ఒకేసారి మూడు కీలక వాతావరణ వ్యవస్థలు బలపడటంతో తమిళనాడుపై తుపాను గండం పొంచి ఉంది. రానున్న 48 గంటల్లో దక్షిణ బంగాళాఖాతంలో తుపాను ఏర్పడే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం (ఆర్ఎంసీ) హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్ష సూచన జారీ చేసింది. ఆర్ఎంసీ డైరెక్టర్ ఏ. ఆముద మీడియాకు వివరాలు వెల్లడించారు. హిందూ మహాసముద్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో మూడు ఆవర్తనాలు క్రియాశీలకంగా ఉన్నాయని తెలిపారు. అండమాన్ సముద్రంలో ఆదివారం ఏర్పడిన తీవ్ర వాయుగుండం పశ్చిమ–వాయవ్య దిశగా కదులుతూ మలేషియా, మలక్కా జలసంధి సమీపంలో కేంద్రీకృతమై ఉందని చెప్పారు. ఇది రాబోయే 24 గంటల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా, ఆ తర్వాత 48 గంటల్లో తుపానుగా మారే అవకాశం ఉందని అంచనా వేశారు. మరోవైపు కన్యాకుమారి ప్రాంతంలో కొనసాగుతున్న అల్పపీడన ద్రోణి ప్రభావంతో రేపు (నవంబర్ 25) కన్యాకుమారి సముద్రం, నైరుతి శ్రీలంక జలాల్లో కొత్త అల్పపీడనం ఏర్పడే సూచనలు ఉన్నాయని తెలిపారు. అరేబియా సముద్రంలోని మూడో ఆవర్తనం కూడా స్థిరంగా ఉందని, ఈ మూడు వ్యవస్థలు ఒకదానిపై ఒకటి ప్రభావం చూపే అవకాశం ఉందని ఆమె వివరించారు. ఈశాన్య రుతుపవనాలు తీవ్రం కావడంతో గత 24 గంటలుగా తమిళనాడులో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో అతి భారీ వర్షపాతం, 15 ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది.



రాబోయే రోజుల్లో తెన్కాశి, తిరునల్వేలి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. నవంబర్ 29 వరకు కన్యాకుమారి, తూత్తుకుడి, తంజావూరు, తిరువారూర్, నాగపట్నం సహా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారిక సూచనలు పాటించాలని అధికారులు కోరారు. కాగా, కొన్ని ప్రైవేటు వాతావరణ సంస్థల అంచనాల ప్రకారం... తుపాను ప్రభావం ఏపీ దక్షిణ కోస్తాపై తీవ్ర స్థాయిలో ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ తుపాను ప్రభావం శనివారం నుంచి ఏపీ కోస్తా జిల్లాలపై ఉంటుందని అంచనా.

# సిద్ధూ వర్సెస్ డీకే.. మధ్యలో మరో నేత!

కన్నడనాట సీఎం సీటు కోసం సిగపట్లు కొనసాగుతున్నాయి. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య కుర్చీలాటకు ఇప్పుడప్పుడే ముగింపు ఉండేట్టు కనబడడం లేదు. అంతా హైకమాండ్ చూసుకుంటుందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కంటితుడుపు ప్రకటన చేశారు. కర్ణాటక కాంగ్రెస్‌లో అసలు సమస్యే లేదన్నట్టుగా ఆయన మాట్లాడారు. మీడియా అనవసరంగా లేని విషయాన్ని ప్రచారం చేస్తోందని నిష్టూరమాడారు. ఇదిలావుంటే ముఖ్యమంత్రి రేసులో తాను ఉన్నానంటూ మరో నాయకుడు తెరపైకి వచ్చారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం నవంబర్ 20 నాటికి రెండున్నరేళ్లు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి మార్పు ప్రచారం ఊపందుకుంది. దీన్నే కొంత మంది 'నవంబర్ విప్లవం'గా వర్ణిస్తున్నారు. 2023లో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య అధికార మార్పిడి ఒప్పందం కుదిరిందని.. దాని ప్రకారం ఇద్దరూ చెరో రెండున్నరేళ్లు సీఎంగా ఉండేందుకు అంగీకరించినట్టు చాలా రోజుల నుంచి ప్రచారం జరుగుతోంది. నవంబర్ 20 నాటికి సిద్ధరామయ్య పదవీకాలం రెండున్నరేళ్లు పూర్తయినందున, ఆయన స్థానంలో డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేస్తారన్న ప్రచారం జోరందుకుంది. దీంతో కన్నడ రాజకీయాల్లో కొద్దిరోజులుగా హీట్ పెరిగింది.

**ముఖ్యమంత్రి రేసులో ఉన్నా**


సిద్ధరామయ్య, శివకుమార్ మధ్యలోకి తాజాగా హోంమంత్రి జి. పరమేశ్వర కూడా వచ్చారు. నాయకత్వ మార్పిడి అనివార్యమైతే తాను కూడా రేసులో ఉంటానని ప్రకటించారు. ముఖ్యమంత్రి మార్పిడిపై కాంగ్రెస్ హైకమాండ్ నుంచి ఎవరూ ఇప్పటివరకు మాట్లాడలేదని ఆయన క్లారిటీ ఇచ్చారు. అలాగే కాంగ్రెస్ శాసనసభా పక్షంలోనూ దీనిపై చర్చించలేదని



వెల్లడిచారు. కాగా, పీసీసీ అధ్యక్షులు ముఖ్యమంత్రి పదవి చేపట్టే అవకాశం కాంగ్రెస్ పార్టీలో ఉందని బెంగళూరులో మీడియా ప్రతినిధులతో అన్నారు. అయితే కొన్ని పరిస్థితుల్లో మాత్రమే దీనికి మినహాయింపు ఉందని ముక్తాయించారు. ముఖ్యమంత్రి రేసులో ఉన్నారా అని పరమేశ్వరను విలేకరులు ప్రశ్నించగా.. "నేను ఎప్పుడూ పోటీలోనే ఉంటాను.. అది పెద్ద సమస్య కాదు. నేను 2013లో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో పార్టీ అధికారంలోకి వచ్చింది. అదంతా నా ఒక్కడి ఘనత అని నేను ఎప్పుడూ చెప్పలేదు. ఆ ఎన్నికల్లో నేను ఓడిపోయాను. ఒకవేళ నేను గెలిచివుంటే ఏం జరిగివుండేదో నాకు తెలియదు"ని బదులిచ్చారు. ముఖ్యమంత్రిని మార్చాలని హైకమాండ్ అనుకుంటే.. మీ పేరును పరిగణనలోకి తీసుకోమ్మని కోరతారా అని అడగ్గా.. "ఆ పరిస్థితి రానివ్వండి అప్పుడు చూద్దాం, అలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదు" అని పరమేశ్వర అన్నారు. దళితుడిని సీఎం చేయాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉందని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

# రూ.5వేల కోట్లు చెల్లించండి.. సందేసర సోదరులకు సుప్రీం ఆదేశాలు!

**న్యూఢిల్లీ:** గుజరాత్ వ్యాపారవేత్తలు సందేసర సోదరుల ఆర్థిక కుంబకోణం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. పలు బ్యాంకుల వద్ద రుణాల ఎగవేతకు పాల్పడిన సందేసర సోదరులు ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు అంగీకరించారు. వారి విజ్ఞప్తికి సుప్రీం కోర్టు అంగీకరించింది. డిసెంబర్ 17లోపు ఆ మొత్తాన్ని చెల్లిస్తే వారిపై నమోదైన అన్నీ క్రిమినల్ కేసులపై విచారణ నిలిపివేస్తామని సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. నితిన్ సందేసర, చేతన్ సందేసర,దీప్తి సందేసర ఇతర కుటుంబ సభ్యులు స్టెర్లింగ్ బయోటెక్ లిమిటెడ్ అనే కంపెనీని ప్రమోట్ చేశారు. ఈ సంస్థ భారత్‌తో పాటు, విదేశీ బ్యాంకుల్లో విదేశీ శాఖల నుంచి రూ.13వేల కోట్లుకు (అంచనా)పైగా రుణాలు తీసుకున్నారు. ఆ రుణాలను డొల్ల కంపెనీల ద్వారా విదేశాలకు మళ్లించి, బ్యాంకులకు నష్టం కలిగించారని కేంద్ర దర్యాప్తు సంస్థలు నిర్ధారించాయి. ఈ కేసు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (%ూచీదీ%) స్కామ్ కంటే పెద్దదిగా భావించబడుతోంది. పీఎన్‌బీ స్కామ్ (నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ) సుమారు రూ. 13,500 కోట్లుకాగా.. సందేసరా బ్రదర్స్ స్కామ్ రూ. 14,000 కోట్లకు పైగా ఉంది. ఇది భారత బ్యాంకింగ్ రంగంలోనే అతిపెద్ద మోసాలలో ఒకటిగా పరిగణలో ఉంది. స్టెర్లింగ్ బయోటెక్ సంస్థపై పదుల సంఖ్యలో ఆర్థిక నేరానికి పాల్పడ్డారనే కేసులు నమోదయ్యాయి. వాటిపై సుప్రీం కోర్టులో సుదీర్ఘంగా విచారణ జరుగుతూ వస్తోంది.



ఈక్రమంలో బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల్ని తిరిగి చెల్లిస్తామని సందేసర సోదరులు ముందుకు వచ్చారు. ఇదే అంశంపై జరిగిన విచారణలో సందేసర సోదరుల విజ్ఞప్తికి సుప్రీం కోర్టు సమ్మతి తెలిపింది. డిసెంబర్ 17 లోగా వారు రుణదాత బ్యాంకులకు రూ.5,100 కోట్ల వన్ టైమ్ సెటిల్‌మెంట్ చెల్లించాలనే షరతు విధించింది. ఈ సందర్భంగా సుప్రీం కీలక వ్యాఖ్యలు చేసింది. నితిన్ సందేసర,చేతన్ సందేసర సహ నిందితులపై సీబీఐ,ఈడీ,పీఎంఎల్ఏ కింద దాఖలు చేసిన అన్ని కేసులను సెటిల్‌మెంట్ మొత్తాన్ని డిపాజిట్ చేసిన తర్వాత క్రిమినల్ విచారణ నిలిపివేస్తామని ఉత్తర్వులో పేర్కొంది. ఆ ఉత్తర్వులో, ప్రజాధనాన్ని తిరిగి పొందడం ప్రాథమిక లక్ష్యం అని బెంచ్ నొక్కి చెప్పింది. మోసం చేసిన మొత్తాన్ని తిరిగి ఇస్తే నేరారోపణలను పొడిగించడం వల్ల ప్రయోజనం ఉండదని పేర్కొంది.

## సీజేఐ ప్రమాణస్వీకారానికి రాహుల్‌గాంధీ రాకపోవడం సిగ్గుచేటు



కాంగ్రెస్ పార్టీ అగ్రనేత లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ భారత నూతన ప్రధాన న్యాయమూర్తి ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరుకాకపోవడం సిగ్గుచేటని బీజేపీ మండిపడింది. ముఖ్యమైన కార్యక్రమాలకు డుమ్మా కొట్టడం ఆయనకు అలవాటుగా మారిందని విమర్శించింది. సీజేఐ ప్రమాణస్వీకారానికి ప్రభుత్వం నుంచి అందరు ప్రముఖులు హాజరయ్యారని, కానీ ప్రతిపక్ష నుంచి రాహుల్‌గాంధీగానీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేగానీ రాకపోవడం సిగ్గుచేటని బీజేపీ నేతలు మండిపడ్డారు. ఇంతటి కీలకమైన కార్యక్రమానికి డుమ్మాకొట్టడం ద్వారా ప్రజాస్వామ్య సంప్రదాయాలను మళ్లీమళ్లీ అగౌరవపరిచే వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారని ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీ ఇప్పుడు ఎక్కడ ఉన్నారో, సీజేఐ ప్రమాణస్వీకారానికి ఎందుకు డుమ్మా కొట్టారో అనే సంగతి ఎవ్వరికీ తెలియదని బీజేపీ అధికార ప్రతినిధి అమిత్ మాళవీయ విమర్శించారు. కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య అంతర్గత కలహాలు విపరీతమవుతున్నా కాంగ్రెస్ అధిష్ఠానం ఏమీ చేయలేకపోతోందని ఆరోపించారు.

## భారత్‌కు రష్యా బంపరాఫర్



**న్యూఢిల్లీ:** భారత్‌కు రష్యా బంపరాఫర్ ప్రకటించింది. రోస్‌నెఫ్ట్, లుకోయిల్ వంటి ప్రధాన రష్యన్ చమురు సంస్థలపై అమెరికా గత వారం ఆంక్షలు విధించడంతో, రష్యా తన ముడి చమురును రెండేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువ ధరలకు భారత్‌కు అందించేందుకు సిద్ధమైంది. భారత రిఫైనర్లకు యురల్స్ ధర డెలివరీ ప్రాతిపదికన డేటెడ్ బ్రెంట్‌తో పోలిస్తే బ్యారెల్‌పై ఏడుడాలర్ల వరకు తగ్గించింది. ఈ ఆఫర్ డిసెంబర్‌లో లోడ్ అయ్యే, జనవరిలో భారత్‌కు చేరే కార్గోలపై వర్తించనుంది. అమెరికా ఆంక్షలకు ముందు యురల్స్ బ్యారెల్‌కు మూడు డాలర్ల వరకు డిస్కౌంట్ ఇచ్చింది.

రోస్‌నెఫ్ట్, లుకోయిల్‌పై ఆంక్షలు అమలులోకి వచ్చిన తర్వాత భారత రిఫైనర్లు రష్యన్ చమురు ఆర్డర్లు తగ్గించాయి. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడి తర్వాత భారత్ చౌకైన చమురును విస్తృతంగా దిగుమతి చేసుకుంది. కానీ ఆంక్షల కారణంగా దిగుమతి నిలిపివేసింది.

అమెరికా ఆంక్షలు రష్యా చమురు వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో రష్యా ప్రధాన చమురు ఉరల్స్‌ను డెలివరీ ఆధారంగా బ్రెంట్ ముడి చమురు కంటే బ్యారెల్‌కు ఏడు డాలర్ల వరకు తగ్గింపుతో భారత రిఫైనరీలకు అందించేందుకు రష్యా సిద్ధమైంది. ఆంక్షలు లేనప్పుడు ఈ తగ్గింపు మూడు డాలర్లుగా ఉండగా, ఇప్పుడు రెండింతలు అయింది. తాజా తగ్గింపు ధరతో వచ్చే చమురు డిసెంబర్ నెలలో లోడ్ అయి జనవరిలో భారత్‌కు చేరే అవకాశం ఉంది.

రోస్‌నెఫ్ట్, లుకోయిల్‌తో పాటు గాజ్‌ప్రోమ్ నెఫ్ట్, సుర్గుట్‌నెఫ్టెగాస్‌పై కూడా అమెరికా ఆంక్షలు విధించింది. దీంతో భారత రిఫైనర్లు మధ్యప్రాచ్యం సహా ఇతర ప్రాంతాల నుండి ఎక్కువ ముడి చమురును కొనుగోలు చేస్తున్నారు. రష్యా చమురు ధరలు తగ్గడం భారత్‌కు తాత్కాలిక లాభం కలిగించవచ్చు. కానీ ఆంక్షల కారణంగా సరఫరా స్థిరత్వం అనిశ్చితంగా మారింది. రిఫైనర్లు తక్కువ ధరల ఆకర్షణతో రష్యన్ చమురును కొనుగోలు చేయడానికి సిద్ధమవుతున్నా, దీర్ఘకాలంలో అమెరికా ఆంక్షలు వాణిజ్యాన్ని మరింత క్లిష్టం చేయవచ్చని నిపుణులు భావిస్తున్నారు. మూడేళ్ల క్రితం ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించిన తర్వాత నుంచి తక్కువ ధరల కారణంగా రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తోంది. నవంబర్ 21 నుంచి అమెరికా ఆంక్షలు అమల్లోకి రావడంతో భారతీయ రిఫైనరీలు రష్యా చమురు ఆర్డర్లను కొంతకాలం నిలిపివేశాయి. ఈ వారంలో ఉరల్స్ చమురు ధర భారీగా తగ్గడంతో భారత రిఫైనరీలు తిరిగి కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపాయి. ఆంక్షలు లేని సంస్థల నుంచి చమురు కొనుగోలుకు సిద్ధమయ్యాయి.

## 'సర్' సర్వేకు వచ్చే ఎన్నికల అధికారులను బంధించండి.. కాంగ్రెస్ మంత్రి వివాదస్పద వ్యాఖ్యలు

కాంగ్రెస్ మంత్రి వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. ఓటరు జాబితాపై స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కోసం వచ్చే ఎన్నికల అధికారులను నిర్బంధించాలని అన్నారు. దీనిపై బీజేపీ స్పందించింది. ఆ మంత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఓటరు జాబితాపై స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం (ఈసీ) అమలు చేస్తున్నది. అయితే ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. కాగా, జార?ండ్‌కు చెందిన కాంగ్రెస్ మంత్రి ఇర్ఫాన్ అన్సారీ ఒక సభలో వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం (సర్)లో భాగంగా ఎన్నికల అధికారులు ఇళ్లకు వచ్చినప్పుడు వారిని బంధించాలని ప్రజలను కోరారు. 'ప్రతి ఒక్కరూ 'సర్'కు వ్యతిరేకంగా నిరసన తెలియజేయాలి. బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌వో) ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడానికి వస్తున్నారు. బీఎల్‌వో మీ ఇంటికి వస్తే వారిని లోపల నిర్బంధించండి. నేను వచ్చిన తర్వాతే విడుదల చేయండి' అని అన్నారు. మరోవైపు జార?ండ్ ఆరోగ్య మంత్రి ఇర్ఫాన్ అన్సారీ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. ఆయన వ్యాఖ్యలు బాధ్యతారహితమైనవని విమర్శించింది. మంత్రి అన్సారీపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బీజేపీ జాతీయ ప్రతినిధి షానవాజ్ హుస్సేన్ డిమాండ్ చేశారు.



# దర్జాగా దందా..!



తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ ఏ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల మంచిర్యాలలోనీ ఒకటి రెండు హాస్పిటల్స్ పైన ఫిర్యాదులు అందాయన్నారు. వాటిపైన విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అగ్ని ధారతో తెలిపారు.

**అగ్నిధారన్యూస్ హైదరాబాద్/మంచిర్యాల క్రైమ్ విభాగం**

వైద్య వృత్తి అంటే ప్రతి ఒక్కరికి గౌరవం వైద్యులు అంటే ప్రజలకు ప్రత్యక్షంగా కనిపించే దైవం డాక్టర్ కనబడగానే రెండు చేతుల దండం పెట్టేంత గౌరవం, నమ్మకం. కానీ ఆవృత్తిని కొందరు కేటుగాళ్లు భ్రష్టు పట్టిస్తున్నారు. అవసరాలతో, వచ్చే అమాయక, ప్రజలను బురడీ కొట్టించి,, వారి అవసరాలను ఆసరా చేసుకోని కొందరు డాక్టర్ల ముసుగు లో ఆర్థిక దోపిడిదారులుగా, అవతార మెత్తుతున్నవారు, వైద్య వృత్తిలో కలుపు మొక్కలుగా తయారవుతున్నారు. కొన్ని ప్రైవేట్ హాస్పిటల్ లో ఆరోగ్యం బాగాలేక కర్మకాళీ కాలు పెడితే ఉన్న ఆస్తులు అమ్ముకొని బయటికి రావలసిన దుస్థితి దాపురించింది. మరోవైపు సంతాన లేమి సమస్యలతో బాధపడుతున్న వారి బాధ వర్ణన రహితం. మారుతున్న కాలమాన జీవన పరిస్థితుల వల్ల, లేట్ మ్యారేజీలు, పెళ్లయిన అనుకున్న సమయానికి సంతానం కలగకపోవడం వల్ల మానసికంగా ఇబ్బంది పడుతున్న దంపతులు నేడు ఎందరో ఉన్నారు. అలాంటి వారి అవసరాలను ఆసరాగా చేసుకుని అర్హత లేని వాళ్ళు మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఐ వి ఎఫ్ కేంద్రాలను నెలకొల్పి నిబంధనలకు విరుద్ధంగా..ప్రచారం మాధ్యమాలలో పెద్దపెద్ద ప్రకటనలు, జిల్లా నలుమూలల హోర్డింగులు సోషల్ మీడియా, ఫేస్బుక్ వాట్సప్ ఇన్స్టాగ్రామ్ యూట్యూబ్ లలో) పెట్టి అమాయకులను ముగ్గులోకి దింపి , ఆశల పల్లకిలోకి లాగి అర్హత లేనివారు, సంతాన సాఫల్య కేంద్రాల పేరుతో ఘరానా మోసాలకు పాల్పడుతున్నారు. ఫెర్టిలిటీ కేంద్రాల పేరుతో, మంచిర్యాల జిల్లా కేంద్రంలో కొన్ని హాస్పిటల్స్, అచ్చిరాని , అర్హత లేని వైద్యం చేస్తూ, ప్రసూతి కేంద్రానికి అనుమతులు తీసుకోని ఐ వి ఎఫ్ ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ సంతాన సాఫల్య కేంద్రాలు నడుపుతున్నారు.. (కృత్రిమ గర్భాదారణ ఆర్టిఫిషల్ ఇన్సమినేషన్ )కేంద్రాలు నడుపుతున్నట్లు అగ్నిధారకు పక్కా సమాచారం ఉంది. ఫెర్టిలిటీ హాస్పిటల్స్ కు ఉండవలసిన నిబంధనలను వైద్యశాఖ అధికారుల అండదండలతో తుంగలో తొక్కి కేటుగాళ్లు వైద్యం ముసుగులో అమాయకుల నుండి ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారు. సంతానం కావాలనుకునే వారి ఆశలను మోసగాళ్లు క్యాష్ చేసుకుంటున్నారు. గైనిక్ డాక్టర్ మొదట మందుల వాడడం ద్వారా సంతానం కలుగుతుందని నమ్మిస్తారు. కొద్ది నేలపాటు మందులు ఇస్తారు. ఆ మందులతో సెట్ కావడం లేదంటూ, బాధితులకు చెబుతారు. వారి మైండ్ సెట్ మార్చుతారు. ఐ వి ఎఫ్ ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్( ఐ వి ఫ్ ) ఇన్ విట్రో ఫర్టిలైజషన్.) ఆర్టిఫిషల్ ఇన్సమినేషన్ ( కృత్రిమ గర్భాధారణ )పద్ధతి ద్వారా సంతానం పొందవచ్చని చెపుతారు. ఇది నిజమే కానీ, ఐ వి ఎఫ్ చేసే అర్హత హాస్పిటల్ కు ఉందా అంటే లేదనే చెప్పాలి. లేని అర్హతలను ఉన్నట్లు అందిపుచ్చుకొని అర్హత లేని వైద్యంతో.. బాధితులను మానసికంగా శారీరకంగా ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తూ దోపిడీ చేస్తున్నారు. రక్తం పీల్చినట్లు లక్షల్లో వైద్యం పేరుతో గుంజుతారు. .. ఐ వి ఎఫ్ చేసే అర్హతే లేని హాస్పటల్లో ఐవీఎఫ్ పద్ధతిలో వైద్యం ఎలా..? చేస్తారు. అనేది ఇక్కడ పెద్ద మిస్టరీ. ఇదే విషయమై మంచిర్యాల జిల్లాలోనీ సంతాన సాఫల్య హాస్పటల్ జరుగుతున్న తంతుపైన మంచిర్యాల జిల్లా వైద్యశాఖ అధికారులను ( ఆర్ టి ఐ.. )సమాచార హక్కు చట్టంలో అడిగిన సమాచారంతో విస్తుపోయే నిజాలు బయటికి వచ్చాయి. హైదరాబాద్ "సృష్టి" హాస్పటల్ లో సరోగసి పేరుతో జరిగిన ఘరానా మోసం యావత్ ప్రపంచానికి తెలిసిందే. ఇక్కడ మంచిర్యాల జిల్లాలో "మరో సృష్టి"నీ తలదన్నే విధంగా బాగోతం నడుస్తుంది. ఆ హాస్పిటల్లో సంతాన సాఫల్య కేంద్రాలలో ఐ వి ఎఫ్ పైన శిక్షణ పొందిన డాక్టర్లు ఉన్నారా అంటే... వైద్యశాఖ అధికారులే చెప్పాలి. వైద్యశాఖ అధికారులు ఏం చేస్తున్నారు, అంటే చోద్యం చూస్తున్నారు. హాస్పిటల్ నిర్వహించాలంటే వైద్యశాఖ అధికారుల అనుమతి తప్పనిసరి తీసుకోవాలి. అదేవిధంగా ఐవిఎఫ్ చేయాలి అంటే గైనకాలజీ స్త్రీ జననేంద్రియ శాస్త్రం లేదా ప్రసూతి శాస్త్రంలో అర్హతతో పాటు తప్పనిసరి మూడు సంవత్సరాలు ఫర్టిలైటీ సెంటర్ లో పనిచేయాలిం 50 పికప్స్ చేసిన అనుభవం ఉండాలి. ఎ ఆర్ టీ లా 2021 నిబంధన ప్రకారం . ఫెలోషిప్ సూపర్ స్పెషలైజేషన్ సంతాన ఉత్పత్తి ఇన్ఫెర్టిలిటీలో ఫెలోషిప్ చేసి ఉండాలి.. అర్హత కలిగిన సిబ్బందితో రాష్ట్ర వైద్య మండలి చెల్లుబాటు అయ్యే విధంగా రిజిస్ట్రేషన్ కాబడి ఉండాలి. ఎ ఆర్ టీ లా 2021 యాక్ట్ పరిధిలో పనిచేయాలి. అర్హత కలిగిన సిబ్బంది క్లినిక్ లో తప్పనిసరిగా నియమించబడాలి. గైనకాలజిస్ట్ అనస్తీసియాలజిస్ట్ కౌన్సిలర్ తో తగిన అర్హత అనుభవం ఉన్న సిబ్బంది ఉండాలి... ఐ వి ఫ్ పద్ధతి.. చేసేముందు దంపతుల నుండి దాతలు నుండి లిఖితపూర్వకంగా డాక్యుమెంట్ ఉండాలి. లింగనిర్ధారణ నిషేధం. పిండం యొక్క లింగం ముందే నిర్ణయించడం లేదా ఎంపిక చేయడం చట్ట విరుద్ధం... అన్నింటికంటే ముఖ్యమైంది హాస్పిటల్ గతంలో చేసిన విజయాల రేట్లు, చికిత్సల ఖర్చులు నిజాయితీగా చెప్పాలి. తప్పుడు ప్రకటనలు మోసపూరిత మాటలు చట్టరీత్యా నేరం. పైన తెలిపిన అర్హతలు నిబంధనలు అనుమతులు అవి ఏమీ లేకుండా మంచిర్యాల జిల్లాలో దర్జాగా సంతాన సాఫల్య కేంద్రం పేరుతో దర్జాగా దంద నడుపుతున్న, హాస్పిటల్ పూర్తి వివరాలు ఇంకా ఉంది..

# టెంపుల్ కారిడార్

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తోంది, ఇప్పటికే హ్యామ్ విధానంలో దాదాపు రూ.లక్ష కోట్ల రోడ్డు ప్రాజెక్టులు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ముఖ్యమైన రహదారులను కూడా విస్తరిస్తున్నారు. తాజాగా.. మరో కొత్త రహదారి అందుబాటులోకి రానుంది. జగిత్యాల జిల్లాలోని ధర్మపురి నుంచి నిజామాబాద్ జిల్లాలోని బాసర వరకు ప్రతిపాదించిన ముఖ్యమైన టెంపుల్ కారిడార్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.380 కోట్లు మంజూరు చేసింది. ఈ విషయాన్ని పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ ఆదివారం ప్రకటించారు. తాను పంపిన ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆమోదం తెలిపి నిధులు విడుదల చేయడంలో సహకరించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ ప్రతిపాదిత టెంపుల్ కారిడార్ తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను అనుసంధానించనుంది. జగిత్యాల జిల్లాలోని ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నుంచి నిజామాబాద్ జిల్లాలోని బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి ఆలయం వరకు ఈ కారిడార్ విస్తరించి ఉంటుంది. ధర్మపురి, కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి టెంపుల్, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం, భీమ్‌గల్ లింబాద్రిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, బాసర ఆలయాలను కలుపుతూ నిర్మించనున్నారు. ఈ కారిడార్ పూర్తయితే.. ఉత్తర తెలంగాణలోని ముఖ్యమైన శైవ, వైష్ణవ, శక్తి, విద్యా దేవాలయాలను ఒకే గొలుసుకట్టులో సందర్శించడానికి భక్తులకు చాలా సౌకర్యంగా ఉంటుంది.ప్రస్తుతం ఈ పుణ్యక్షేత్రాలకు వెళ్ళడానికి ఉన్న రోడ్లు చాలా వరకు ఇరుకుగా, గుంతలతో, కొన్ని చోట్ల మరమ్మతులకు గురై ఉన్నాయి. కారిడార్ నిర్మాణం వల్ల రహదారులు వెడల్పుగా.. మెరుగైన నాణ్యతతో తయారవుతాయి. నాణ్యమైన రోడ్ల కారణంగా ధర్మపురి– బాసర మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. ఈ కారిడార్ మార్గంలో ఉన్న చిన్న పట్టణాలు, గ్రామాల ప్రజలకు పర్యాటక, వాణిజ్య రంగాలలో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. తెలంగాణలోని ఆధ్యాత్మిక వైభవాన్ని దేశవ్యాప్తంగా అంతర్జాతీయంగా



విస్తరించడానికి ఈ కారిడార్ కీలకంగా మారుతుంది.ప్రస్తుతం ధర్మపురి, కొండగట్టు, వేములవాడ, లింబాద్రి గుట్టలను కలుపుతూ ఉన్న రోడ్లు జిల్లా, రాష్ట్ర రహదారులుగా ఉన్నాయి. వీటిలో చాలా మార్గాలలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండటం, వాహనాల వేగానికి అనుగుణంగా రోడ్ల వెడల్పు లేకపోవడం, కొన్నిచోట్ల భారీ వాహనాల రాకపోకలు పెరగడం వల్ల త్వరగా గుంతలు పడటం వంటి సమస్యలు ఉన్నాయి. టెంపుల్ కారిడార్ నిర్మాణం ఈ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపుతుందని అధికారులు భావిస్తున్నారు.

# పన్నుల సెగ.. బ్రిటన్‌కు స్టీల్ టైకూన్ లక్ష్మీ మిట్టల్ గుడ్‌బై?

సంపన్నులపై బ్రిటన్ ప్రభుత్వం పన్నుల భారాన్ని భారీగా పెంచేందుకు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రభుత్వ నిర్ణయం సంపన్నులను ఆలోచనలో పడేసింది. పలువురు బిలియనీర్లు యూకేను వీడి.. పన్ను మినహాయింపు దేశాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలువురు యూకేని వీడగా.. ఇప్పుడు ఆ జాబితాలోకి భారత్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, స్టీల్ టైకూన్ లక్ష్మీ మిట్టల్ వచ్చి చేరారు. భారత్‌కు చెందిన బిలియనీర్, ఉక్కు తయారీ రంగ దిగ్గజం ఆర్సెలార్ మిట్టల్ సంస్థ అధినేత లక్ష్మీ మిట్టల్.. బ్రిటన్‌ను వీడనున్నట్లు తెలుస్తోంది . ప్రభుత్వ పన్ను విధానం నేపథ్యంలో ఆ దేశాన్ని వీడాలని మిట్టల్ నిర్ణయించుకున్నట్లు బ్రిటన్ మీడియా నివేదించింది. ఆయన దుబాయ్‌కి మకాం మార్చే అవకాశం ఉందని తెలిసింది. ఇకపై పెట్టుబడులన్నీ దుబాయ్‌లోనే పెట్టే యోచనలో మిట్టల్ ఉన్నట్లు ది సండే టైమ్స్ నివేదించింది. బ్రిటన్‌లో ఉన్నప్పటికీ వారి శాశ్వత నివాసం ఇతర దేశాల్లో ఉంటే.. విదేశీ ఆదాయంపై బ్రిటన్‌లో వారు పన్నులు కట్టనక్కర్లేదు. అయితే ఇప్పుడు ఈ విధానాన్ని తొలగించాలని కీర్ స్టార్మర్ ప్రభుత్వం నిర్ణయించిన విషయం



తెలిసిందే. దీంతో పన్నుల భారం నుంచి తప్పించుకునేందుకు సంపన్నులు దేశం వీడుతున్నారు. కాగా, రాజస్థాన్‌లో జన్మించిన మిట్టల్.. బ్రిటన్‌లో 8వ అత్యంత సంపన్నుడిగా కొనసాగుతున్నారు. ఆయన ఆస్తుల విలువ 15.4 బిలియన్ పౌండ్లుగా ఉంది. ఆర్సెలార్ మిట్టల్ సంస్థలో లక్ష్మీ మిట్టల్ కుటుంబానికి 40 శాతం వాటా ఉంది.

## ప్రభుత్వం సిద్ధంగా ఉంది

-మొదటిపేజీ తరువాయి

రిజర్వేషన్లను కూడా ఖరారు చేసింది. ఇదిలా ఉండగా, పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరగాల్సి ఉండగా, ప్రధాన న్యాయమూర్తి సెలవులో ఉండటం వలన విచారణ జరగలేదు. ఈ కేసు మంగళవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా నోటిఫికేషన్ జారీ చేయడానికి సిద్ధంగా ఉంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12,733 పంచాయతీలు, 1,12,288 వార్డులకు మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది.

## విద్యతోనే పేదల ఇంట్లో వెలుగులు

-మొదటిపేజీ తరువాయి

ఇచ్చారు. ఆడబిడ్డలు సంతోషంగా ఉంటే.. రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధి ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కొడంగల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఆడబిడ్డల ఆత్మగౌరవంతో బతికేలా ఉండాలని తమ ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. ప్రతి పేద తల్లి కళ్లల్లో ఆనందం చూడాలని సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. అదానీ, అంబానీలతో పోటి పడేలా సోలార్ ప్లాంట్స్ నిర్వహణను మహిళలకు అప్పగించామని వివరించారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించామని వివరించారు.

హైటెక్ సిటీ శిల్పారామంలో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు స్టాల్స్ సైతం ఏర్పాటు చేశామని వివరించారు. ఆడబిడ్డలు తయారు చేసిన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించేందుకు అమెజాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొన్నారు. మీ జీవితాల్లో వెలుగులు నింపేందుకు మంచి చదువు అందించడం ఒక్కటే మార్గమని సూచించారు. మీ పిల్లలు గొప్పగా చదువుకుంటేనే మీ జీవితాల్లో మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అందుకే అక్షయ పాత్ర ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 312 ప్రభుత్వ పాఠశాలల్లో 28 వేల మంది విద్యార్థులకు ఉదయం బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని చెప్పారు. ఏ విద్యార్థి ఆకలితో ఇబ్బంది పడకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా మధ్యాహ్న భోజనాన్ని అందించే కార్యక్రమం తీసుకువస్తున్నామన్నారు. బిడ్డల గురించి కన్నతల్లి ఆలోచించినట్లుగా%ా% తమ ప్రభుత్వం ఆలోచించి వారి ఆకలి తీరుస్తోందని తెలిపారు.

ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలకు తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కొడంగల్ నియోజకవర్గానికి మెడికల్, వెటర్నరీ, అగ్రి, పారామెడికల్, నర్సింగ్, ఇంజనీరింగ్ కళాశాలలు , ఏటీసీలను, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్, డిగ్రీ కళాశాలలు, సైనిక్ స్కూల్ తీసుకొచ్చామని వివరించారు. విద్య ఒక్కటే తరగని ఆస్తి అని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి గొప్ప చదువుల కోసం కొడంగల్‌కు వెళ్లాలనేలా ఈ అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. 16 నెలల్లో అంతర్జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ హబ్‌గా కొడంగల్‌ను మార్చాలని ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇస్తున్నారని చెప్పారు. మూడేళ్లల్లో ప్రాజెక్టు పూర్తి చేసి కొడంగల్ భూములను కృష్ణా జలాలతో తడుపుతామని విశ్వాసం వ్యక్తం చేశారు . లగచర్ల పారిశ్రామిక వాడను అంతర్జాతీయ పారిశ్రామిక వాడగా తీర్చి దిద్దుతామని స్పష్టం చేశారు. త్వరలోనే కొడంగల్ ప్రజలు రైలు కూతను కూడా వినబోతున్నారన్నారు. కొడంగల్ ప్రజల 70 ఏళ్ల కల నెరవేరబోతుందన్నారు. మరో తొమ్మిది నెలల్లో రైల్వే లైన్ ఏర్పాటు పనులు ప్రారంభంకానున్నాయని తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్రమలు సైతం ఏర్పాటు కాబోతున్నాయని వివరించారు. అభివృద్ధిలో కొడంగల్ నియోజకవర్గాన్ని రాష్ట్రానికి ఒక మోడల్‌గా మారుస్తామని చెప్పారు. సర్పంచ్ ఎన్నికల్లో మంచి వ్యక్తులను ఎన్నుకోండంటూ ప్రజలకు సూచించారు. ఆడబిడ్డలకు ప్రభుత్వం అందిస్తున్న సారె ఇందిరమ్మ చీరలని.. ఇవి ప్రతి ఆడబిడ్డకు చీర చేరేలా చూడాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పదేళ్లు రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. రాజకీయాలకు అతీతంగా కొడంగల్‌ను అభివృద్ధి చేసుకునేందుకు ముందుకు రావాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. అభివృద్ధికి అండగా ఉండాలని ఈ సందర్భంగా ఆడబిడ్డలను సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

## బీసీలకు కాంగ్రెస్ చేస్తున్న ద్రోహాన్ని ఎండగడతాం


-మొదటిపేజీ తరువాయి

జరగకముందే 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు తెలంగాణలో ఇచ్చినట్లు దేశవ్యాప్తంగా చెప్పుకుంటూ తిరుగుతున్న రాహుల్ గాంధీ చేస్తున్న మోసాన్ని దేశ ప్రజల ముందు ఉంచుతామన్నారు. రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే లోక్‌సభలో అపోజిషన్ లీడర్‌గా ఉన్న ఆయన వెంటనే ఈ అంశం పైన పార్లమెంటులో చర్చకు వచ్చేలా చూడాలన్నారు. ఒకవేళ కేంద్రంలోని బీజేపీ సహకరించకుంటే రాహుల్ గాంధీ ఎందుకు ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తరని ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి నిజంగానే బీసీలపై, 42 శాతం రిజర్వేషన్ల అంశం పైన చిత్తశుద్ధి ఉంటే ప్రైవేట్ మెంబర్ బిల్లు సైతం ప్రవేశపెట్టవచ్చు కదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ అంశంపై రానున్న పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ నుంచి ఎన్నికై ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు లోక్‌సభలో గళం లేవనెత్తాలన్నారు. బీజేపీ పదేపదే బీసీల మాట చెబుతుంది కానీ వారికి రిజర్వేషన్ల నుంచి మొదలుకొని నిధుల అమలు దాకా, ఓబీసీ సంక్షేమ శాఖ వరకు అన్ని అంశాల్లో ద్రోహం చేస్తున్నదని, బీజేపీ చేస్తున్న మోసాన్ని సైతం ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల చుట్టే మొత్తం అంశాన్ని తిప్పుతూ, కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చే విద్య, ఉపాధి, ప్రభుత్వ కాంట్రాక్టులలో 42 శాతం రిజర్వేషన్ ఇచ్చే అంశాన్ని పక్కన పెట్టిందని కేటీఆర్ అన్నారు. దీంతోపాటు బీసీలకు బడ్జెట్‌లో సంవత్సరానికి ?20,000 కోట్ల రూపాయలు కేటాయిస్తామని చెప్పి దాని ఊసే ఎత్తడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. వచ్చే బడ్జెట్‌లో 20వేల కోట్ల రూపాయల నిధులను కేటాయించేలా కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి తీసుకువస్తామని కేటీఆర్ తెలిపారు. బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల రిజర్వేషన్లతో పాటు బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేస్తున్న మోసాన్ని గ్రామ స్థాయి వరకు వివిధ రూపాల్లో తీసుకువెళ్లాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు చేపట్టవలసిన కార్యాచరణ పైన కేటీఆర్ పలు సూచనలు చేశారు.

## కోట్లపేట

-మొదటిపేజీ తరువాయి

ధర పలికింది. హెచ్‌ఎండీఏ పరిధిలోని ఖరీదైన భూములను ఆన్‌లైన్‌లో వేలం వేయడానికి ప్రభుత్వం నిర్ణయించి నోటిఫికేషన్ జారీ చేసిన విషయం విదితమే. మొత్తం 9.90 ఎకరాలకు గాను రూ.1,355.33 కోట్ల ఆదాయం హెచ్‌ఎండీఏకు సమకూరింది. కొద్ది రోజుల క్రితం రాయదుర్గంలోని 7.67 ఎకరాలకు తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ నిర్వహించిన వేలంలో రూ.1,357 కోట్లకు ఒక సంస్థ దక్కించుకుంది. అక్కడ కనీస ధర ఎకరాకు రూ.101 కోట్లుగా నిర్ణయించగా, వేలంలో రూ.177 కోట్లు పలికింది. ఈ నేపథ్యంలో తాజాగా కోకాపేట నియోపొలిస్‌లోని భూములకు ఎకరం కనీస ధర రూ.99 కోట్లు నిర్ణయించగా, రూ.137.25 కోట్లు పలికింది.



# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

**రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి డి.శ్రీధర్ బాబు.**

**18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు చీర పంపిణీ.**

**ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేసిన మంత్రి శ్రీధర్ బాబు**





**అగ్నిధార న్యూస్,పెద్దపల్లి, నవంబర్-24:** సోమవారం పెద్దపల్లి పట్టణంలోని స్వరూప గార్డెన్స్ లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ లతో కలిసి పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం కల్పిస్తుందని మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు.ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ,మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు రవాణా కల్పిస్తే ప్రతిపక్షాలు తట్టుకోలేక పోతున్నాయని, దీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని వీరికి జూబ్లీహిల్స్ మహిళలు కర్రు కాల్చి వాత పెట్టారని మంత్రి తెలిపారు. గత 10 సంవత్సరాల పాలనలో ఎప్పుడైనా వడ్డి లేని రుణాలు అందించాలని ఆలోచన పాలకులకు రాలేదని, మన ప్రభుత్వం 5 సంవత్సరాల కాలంలో లక్ష కోట్ల రూపాయలు బ్యాంకు లింకేజ్ ద్వారా వడ్డీ లేకుండా మహిళా సంఘాలకు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో మొదటి ఏడాది వడ్డీ లేని రుణాలు కింద 9 కోట్ల రూపాయలు విడుదల చేసామని, ప్రస్తుత సంవత్సరం మరో 10 కోట్ల రూపాయలు విడుదల చేయబోతున్నామని అన్నారు. 2047 తెలంగాణ రైసింగ్ పాలసీ లో భాగంగా మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తూ కోటీశ్వరులను చేసేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. మహిళలకు ప్రత్యేకంగా పారిశ్రామిక వాడలలో భూముల కేటాయింపుకు ఆలోచన చేస్తున్నామని అన్నారు. పేద కుటుంబంలోని మహిళలు ఇబ్బందులు పడవద్దని 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయల గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని అన్నారు. ఆర్థిక వ్యవస్థను బాగు చేస్తూ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోనే మహిళలకు సారే అందించాలని లక్ష్యంతో నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. రేషన్ కార్డు లో పేరు ఉన్న ప్రతి ఒక్కరికి చీరలు పంపిణీ చేస్తామని అన్నారు. పట్టణ ప్రాంతంలోని మహిళలకు వచ్చే సంవత్సరం మహిళా దినోత్సవం సందర్భంగా చీరలు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను బాగు చేస్తున్నామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షల రూపాయల పెంచామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టామని, రాబోయే 2 సంవత్సరాల కాలంలో ప్రతి పాఠశాల రూపురేఖలు పూర్తిస్థాయిలో మారుస్తామని అన్నారు.యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పెద్దపల్లిలో టాస్క్ రీజినల్ సెంటర్ ఏర్పాటు చేశామని అన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి లో సిటి స్కాన్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజల సంక్షేమానికి పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు తమ ఆశీర్వాదం అందించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ చీరల పంపిణీ మొదటి విడత గ్రామీణ ప్రాంతాలలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు పంపిణీ చేస్తున్నామని అన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాల సిసిలు , విఓ లు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం వేగవంతంగా పూర్తి చేసి చీర అందుకున్న ప్రతి మహిళ ఫోటో యాప్ లో నమోదు చేయాలని అన్నారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా మొదటి విడత కింద లక్షా 20 వేల ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ, గత ప్రభుత్వం బతుకమ్మ చీరల పేరిట నాసిరకం చీరలు పంపిణీ చేసి మహిళలను అగౌరవ పరిచారని అన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి మంచి డిజైన్ తో నాణ్యమైన చీరలను మహిళలకు అందిస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నాణ్యమైన చీరను రేవంతన్న ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. వడ్డీ లేని రుణాలు గత ప్రభుత్వం విస్మరిస్తే మన ప్రజా ప్రభుత్వం పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో మహిళలకు వడ్డి లేని రుణాలు పంపిణీ చేసి 4 కోట్ల 73 లక్షల రూపాయల వడ్డీ డబ్బులు మహిళా బ్యాంక్ ఖాతాలలో జమ చేశామని, ప్రస్తుత సంవత్సరానికి మరో 5 కోట్ల 23 లక్షల పైగా వడ్డీ డబ్బులను కూడా మహిళా సంఘాల ఖాతాలలో జమ చేస్తామని అన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, ప్రతి మహిళ మరో 10 మందికి ఉపాధి అందించే స్థాయికి ఎదిగే దిశగా సహకారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. రైతులు, యువత, కార్మికులు, మహిళల సంక్షేమమే అభ్యున్నతిగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. మహిళా సంఘాలకు లక్ష కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తూ చిన్న, కుటీర పరిశ్రమల స్థాపనలో మహిళలు ముందు ఉండేలా చూస్తున్నామని అన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో అద్దెకు ఆర్టిసి బస్సులు పెట్రోల్ బంక్ ఏర్పాటు , సోలార్ విద్యుత్ ప్లాంట్ల స్థాపన వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, ఆర్.డి.ఓ.గంగయ్య, గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, తహసిల్దార్ ఎంపిడిఓ సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాప్యం శాపం కాదు..
# ప్రకృతి ధర్మం, జీవిత జ్ఞానం

వృద్ధి అంటే డబ్బు సంపాదనలో, కోరికలు తీర్చుకోవటంలో, బంధాలు అనురాగాలు పెంచుకోవడంలో వృద్ధి కాదు.. ఇలాంటి వాటి అన్నింటిని పక్కన పెట్టగలిగే మానసిక అభివృద్ధిని పొంద గలిగిన స్థితి.ఆ స్థితి వయసు మళ్లిన వారు కలిగి ఉంటారు కాబట్టి వారిని వృద్ధులుగా సంబోధిస్తారు. జీవిత చరమాంకంలో మోహాలు, కోరికలు, బాధ్యతలు, బంధాలు, బంధుత్వాలు రాగ ద్వేషాలకు అతీతంగా ఆధ్యాత్మిక చింతనతో అభివృద్ధి చెందటమే నిజమైన వృద్ధి పొందటం. ఈ దశ పరిణతితో, జ్ఞానంతో కూడిన ప్రయాణం. వృద్ధాప్యం ప్రతి వ్యక్తికి అనివార్యం. డబ్బుతో కొనలేని అను భవాల సారమే వృద్ధాప్యం. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా, బాసటగా నిలుస్తున్న వృద్ధులను మన తాత, అవ్వలను గౌరవిస్తూ వారి సలహాలను, సూచనలను స్వీకరిస్తూ ముందుకు వెళ్లాల్సిన అవసరం, బాధ్యత ప్రస్తుతం పిల్లలలో, యువతలో ఎంతైనా ఉంది. వృద్ధుల జ్ఞానం, అనుభవం యువతకు చూపుడువేలు కావాలి. మానసికంగా సరియైన వ్యాపకాలను ఏర్పరచుకొని ముందుకు వెళ్లగలిగితే ఈ దశను సైతం ఆనందంగా జయించవచ్చు. వృద్ధాప్యం అనేది ఒక శాపం కాదు ప్రకృతి ధర్మం. జీవిత చక్రంలో ఒక భాగం. బాల్యం, యవ్వనం తర్వాత వచ్చే సహజ ప్రక్రియ. వృద్ధాప్యాన్ని ప్రకృతి సూత్రంగా మనం పరిగణించవచ్చు. అంటే, వసంతంలో చెట్లు పచ్చగా ఉంటూనే శిశిరంలో ఆకులు రాలిపోయి ఎలా నిస్తేజంగా మారతాయో అలాగే మనిషి శరీరం కూడా వయసుతోపాటు బలహీనపడుతుంది. వృద్ధాప్యం అనేది శారీరక సహజ పరిణామం. కొంతమంది నిస్సహాయులు దానిని జయించటం లో ఎన్నో ఒడిదుడుకులు, ఇబ్బందులు, కష్టనష్టాలు ఎదుర్కోలేక ఒక శాపంగా భావిస్తున్నారు. కానీ అది నిజం కాదు. అది ప్రకృతి ధర్మం. సహజంగా వృద్ధులకు ఈ దశలో వెనుక చూపే ఉంటుంది. ముందుచూపు మసకబారుతుంది. ఆధునిక జీవనశైలి వృద్ధులకు తగిన మద్దతు, సంరక్షణ ఇవ్వటం లేదు. వయసు పెరుగుతున్న కొద్దీ రకరకాల ఆరోగ్య సమస్యలతో మానసిక ప్రశాంతతను కోల్పోవడం సహజ లక్షణంగా పేర్కొనవచ్చు. దీర్ఘకాలిక శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు వృద్ధులను కుంగుబాటుకు గురి చేస్తున్నాయి. సామాజిక , మానసిక ఒంటరితనం కుటుంబ సభ్యులు ముఖ్యంగా యువత ఉపాధి కోసం పట్టణాలకు, నగరాలకు వలస వెళ్లడం వలన చాలామంది వృద్ధులు ఒంటరితనం అనే సంద్రాన్ని అతి కష్టంగా ఈదుతున్నారు. ఇది నిరాశ, నిస్పృహ, ఆందోళన వంటి మానసిక సమస్యలకు దారితీస్తుంది. వృద్ధాప్యంలో ఆదాయ వనరులు సరిగా లేకపోవడం వలన చాలామంది వృద్ధులు వారి అవసరాలను మరీ ముఖ్యంగా వైద్య ఖర్చులను సైతం భరించలేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వృద్ధాప్యంలో సవాళ్లు మాత్రమే కాకుండా సానుకూల అంశాలను సైతం గమనించవచ్చు. జ్ఞానం, అనుభవం. వృద్ధాప్యం అనేది అనుభవాల సారం. వారి జ్ఞానం, ఆలోచనలు, సలహాలు, సూచనలు కుటుంబానికి, సమాజానికి మార్గదర్శకంగా ఉపయోగపడతాయి. కుటుంబంతో, ఆత్మీయు లతో నాణ్యమైన సమయాన్ని గడపటానికి వారి అభిరుచులను, అనుభవాలను పంచుకోవడానికి మంచి అవకాశం లభిస్తుంది. అయినప్పటికీ కుటుంబ సభ్యుల నుండి, సమాజం నుండి, ప్రభుత్వం నుండి సరైన మద్దతు సంరక్షణ లభించినట్లయితే వారు వారి జీవితాన్ని ఆనందంగా జీవించగలుగుతారు. వారిని సమాజ నిర్మాణంలో భాగస్వాములను చేయటం ద్వారా మెరుగైన సమాజాన్ని నిర్మించుకోగలుగుతాము.

# ఆర్థిక సంక్షోభానికి కారణమెవరు?

భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు ఒక సంక్రమణ దశలో ఉంది. దేశాభివృద్ధికి పునాది వేసిన ప్రభుత్వ రంగ సంస్థలు నేడు అపూర్వమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితి యాదృచ్ఛికం కాదు, గత దశాబ్దంలో అమలైన కొన్ని త్వరపాటు నిర్ణయాలు, ఆలోచనలేని సంస్కరణలు, జాతీయ ఆస్తుల పరిరక్షణలో ప్రభుత్వ వైఫల్యమే దీనికి కారణం. ఒక దశాబ్దపు ఆర్థిక పొరపాట్లు ఒకసారి పరిశీలిస్తే ఒక్కోసారి భయమేస్తుంది. 2016 నవంబర్ 8 రాత్రి జరిగిన పెద్దనోట్ల రద్దు నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద దెబ్బతీసింది. డాక్టర్ మన్మోహన్ సింగ్ హెచ్చరించినట్టు జీడీపీలో రెండు శాతం పడిపోవడం ఒక్కటే కాదు, దేశపు అనధికారిక రంగం పూర్తిగా కుదేలైంది. లక్షలాది చిన్న, మధ్య తరహా వ్యాపారాలు మూతబడ్డాయి. ఆ దెబ్బ నుంచి కోలుకునేలోపే, ప్రభుత్వం తయారీ సరిగా లేని జీఎస్టీని అమలు చేసింది. పలుస్థాయిల పన్నులు, క్లిష్టమైన రిటర్నులు, చిన్న వ్యాపారులకు తీవ్రమైన భారమయ్యాయి. ఈ రెండు నిర్ణయాలు కలిసి ఆర్థిక వ్యవస్థను దీర్ఘకాలిక మాంద్యంలోకి నెట్టాయి. ప్రజలపై భారమయ్యే పన్నులు, కార్పొరేట్లకు పెద్దలాభాలు తెచ్చిపెట్టాయి. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు తగ్గిన సందర్భంలో, సాధారణంగా ప్రభుత్వాలు ప్రజలకు ఆ ప్రయోజనాలం దిస్తాయి. కానీ ఇక్కడ ధరలు తగ్గినా, పన్నులు మాత్రం పెరిగాయి. అదే సమయానికి, 2019లో ప్రభుత్వం కార్పొరేట్లకు భారీ పన్ను రాయితీ ఇచ్చింది. దేశ ఖజానాకు రూ.1.45 లక్షల కోట్ల నష్టం జరిగినా, పెట్టుబడులు పెరగలేదు. ప్రజారంగ సంస్థల 'ఫర్ సేల్'. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం చేపట్టిన మార్గం, అతివేగంగా ప్రయివేటీకరణ. ఇది సంప్రదాయ 'డిస్ఇన్వెస్ట్మెంట్' కాదు. ఇది జాతీయ ఆస్తుల 'అమ్మకం'



అది కూడా తొందరపాటు, అత్యవసర సమయాల్లో చేసే ఫర్ సేల్ విధానం. ప్రభుత్వ వాదన ఏంటంటే ప్రయివేటీకరణ వల్ల సామర్థ్యం పెరుగుతుందని, సంక్షేమ పథకాలకు నిధులు లభిస్తాయని. కానీ నిజంగా జరుగుతున్నది ఏమిటంటే లాభాలు ప్రయివేటు రంగానికి, నష్టాలు ప్రజలకు. అవమానకరమైన చరిత్ర పాఠాలు తెలుసుకున్నా ప్రభుత్వ తీరు మారలేదు. బీఎస్ఎన్ఎల్ విక్రయం తక్కువ విలువలో జరిగినట్లు అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. నేడు కూడా ఐడీబీఐ, ఓఎన్జీసీ, హెచ్పీసీఎల్ వంటి లావాదేవీలు నిజమైన డిస్ఇన్వెస్ట్మెంట్ కావు, అవి ప్రభుత్వం ఒక జేబులోంచి మరొక జేబులో డబ్బు మార్చినట్టు. దీర్ఘకాల ప్రమాదాలు గురించి ప్రభుత్వం దగ్గర సమాధానాలు లేవు. ఇప్పటికే నిరుద్యోగం అత్యధిక స్థాయిలో ఉండగా, ప్రజారంగ ఉద్యోగాలకు ముప్పు వస్తే దాని ప్రభావం ఘోరంగా ఉంటుంది. ఎక్కడ స్పష్టత లేదు. ఆస్తులకు విలువ ఎలా నిర్ణయించారు? రిజర్వ్ ప్రైస్ ఎలా లెక్కించారు? ప్రభుత్వం ఈ ప్రశ్నలకు సమాధానమివ్వకుండా ముందుకు సాగుతుండటం అనుమానాలు మరింత పెంచుతుంది. అన్ని ప్రభుత్వరంగ సంస్థలు ఒకేలా ఉండవు. కొన్ని లాభాల్లోనే ఉన్నాయి. కొన్ని పునర్వ్యవస్థీకరణ చేస్తే లాభదాయక మవుతాయి. కొన్ని మాత్రమే అమ్మకానికి అనర్హం. ప్రతి సంస్థకు విడిగా వ్యూహం అవసరం. దీర్ఘకాలిక దృష్టి అవసరం. జాతీయ ఆస్తులు కాపాడే బాధ్యత అవసరం. ప్రభుత్వం తరచూ చెప్పేది %-% "వాణిజ్యం చేయడం ప్రభుత్వం చేయాల్సిన పని కాదు". వాస్తవమేమిటంటే, దేశ ఆర్థిక వ్యవస్థను సరిగా నడపలేని ప్రభుత్వం, ఉద్యోగాలు సృష్టించలేని ప్రభుత్వం, సామాజిక న్యాయాన్ని కాపాడలేని ప్రభుత్వం జాతీయ ఆస్తుల్ని అమ్మే హక్కులేదు. భారత ప్రజారంగం దేశ స్వావలంబనకు, సామాజిక సమానతకు, మౌలిక అభివృద్ధికి పునాది. దాన్ని తొందరపాటు నిర్ణయాలతో అడ్డగోలుగా విక్రయించడం భవిష్యత్తు తరాల పట్ల ఘోర అన్యాయం.

## సంపాదకీయం

# విద్యావిధానంపై దృష్టి

ప్రధాని నరేంద్రమోదీ మెకాలే విద్యా విధానాన్ని 2035 నాటికి భారత్ నుంచి పూర్తిగా తొలగించాలనే సంకల్పం వ్యక్తం చేయడం ఒక చారిత్రాత్మక నిర్ణయం అని చెప్పొచ్చు. ఇది భారత ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించే సాహసోపేత ప్రయత్నం. ఇప్పటి ప్రపంచం టెక్నాలజీ ఆధారంగా వేగంగా మారిపోతుంది. ఆర్టిఫిషియల ఇంటలిజెన్స్ అంటే అంతర్జాతీయ మేధస్సు ముఖ్యంగా అమెరికా టెక్నాలజీ ప్రభావం ప్రపంచాన్ని ఒకే గ్లోబల్ విలేజ్గా మార్చేస్తోంది. అందువల్ల ప్రపంచ ధోరణికి అనుగుణం గా మన విద్యా విధానాన్ని మలచడం అవసరం.దేశ భవిష్యత్తు నిర్మాణానికి అఖండ పునాదిగా నిలవాల్సిన భారత విద్యా వ్యవస్థ,, నేడు లోపాలు, నిర్లక్ష్యం, అసమానతల భారంతో ఆధారాలు దెబ్బతిన్న శిఖరంలా విద్యా వ్యవస్థ క్రమంగా క్షీణిస్తోంది. విద్య కేవలం బోధన కాదు, అది ఆర్థిక స్వావలంబనకు, సాంకేతిక శక్తి సంపన్నతకు, సామాజిక న్యాయ సాధనకు మార్గం చూపే విప్లవాత్మక శక్తి. ప్రతి విద్యార్థి సక్రమంగా మానవ వనరుగా వికసిస్తే భారతదేశం జ్ఞాన విప్లవానికి కేంద్రబిందు వుగా అవతరిస్తుంది. కానీ ప్రభుత్వాల నిర్లక్ష్యం, నిధుల లోటు, విధాన అస్పష్టత నాణ్యమైన విద్యను అడ్డుకుని సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను దెబ్బతీశాయి.ఏడు దశాబ్దాల సంస్కరణలు, విద్యా కమిషన్లు, విధానాలు గుణాత్మక విద్యను అందించడంలో విఫలమయ్యా యి. అక్షరాస్యత 80.9% ఉన్నప్పటికీ ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు పరిమితంగానే ఉన్నాయి. నూతన జాతీయ విద్యా విధానం-2020 అవకాశాలు, సవాళ్లు రెండూ కలిగి ఉన్నప్పటికీ, రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా దాన్ని మలచుకుంటే విద్యలో నిజమైన సామాజిక మార్పు సాధ్యమవుతుంది.భారత విద్యా వ్యవస్థలో అత్యంత ఆందోళనకర అంశం స్థూల నమోదు నిష్పత్తి క్షీణత. విద్యా స్థాయిలు పెరిగే కొద్దీ విద్యార్థుల నమోదు పడిపోవడం దేశ భవిష్యత్తుకే సవాలుగా మారింది. 'యునైటెడ్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్' ప్రకారం ప్రాథమిక స్థాయిలో నమోదు 82.2%, హయ్యర్ సెకండరీలో 35.8%, ఉన్నత విద్యలో కేవలం 28.4% మాత్రమే. నూతన విద్యా విధానం 2035 నాటికి 50% లక్ష్యం నిర్దేశించినా, ప్రస్తుత స్థితిలో అది కష్టసాధ్యం. అభివృద్ధి చెందిన దేశాలు 6?8% జీడీపీని విద్యపై ఖర్చు చేస్తే, భారత్ ఇంకా 3% కన్నా తక్కువే ఖర్చు చేస్తోంది. కొఠారి కమిషన్ సూచించిన 6% పెట్టుబడి ఇప్పటికీ నెరవేరలేదు. ఉన్నత విద్యలో సీట్ల కొరత, రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఆర్థిక లోటు, మాతృభాష బోధన లోపం సమస్యలుగా మారాయి. ఫలితంగా యువత నాణ్యమైన విద్యను పొందడంలో వెనుకబడుతోంది. అందువల్ల విద్యా సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక విధానాల అమలు అత్యవసరం.భారత విద్యా వ్యవస్థ నాలుగు స్థాయిల్లో అభివృద్ధి చెందుతున్నా ప్రతి దశకు ప్రత్యేక సవాళ్లు కొనసాగుతున్నాయి. ప్రాథమిక స్థాయిలో సర్వశిక్షా అభియాన్, మిడ్డే మీల్స్తో చేరిక పెరిగినా మౌలిక వసతుల లోపం, ఉపాధ్యాయుల కొరత, నేర్చుకునే సమస్యలు ఉన్నాయి. మాధ్యమిక స్థాయిలో నమోదు ఎక్కువైనా బాలికల డ్రాప్ అవుట్, పాత సిలబస్, నైపుణ్యాభివృద్ధి లోపం సమస్యలుగా ఉన్నాయి. ఇంటర్మీడియట్లో పరీక్షా ఒత్తిడి, ఆత్మహత్యలు, అధ్యాపకుల కొరత, ప్రైవేట్ కోచింగ్ ఆధిపత్యం విద్యను భారంగా మారుస్తున్నాయి. ఉన్నత విద్యలో ఐఐటీలు, ఐఎంఎంలు అంతర్జాతీయ గుర్తింపు పొందినా, 'కేంద్ర విశ్వవిద్యాలయాలు' పరిమిత అందుబాటుతో సాధారణ విద్యార్థులకు అందని ద్రాక్షలుగా మారాయి. 'రాష్ట్ర విశ్వవిద్యాలయాలు' నిధుల కొరత, అధ్యాపకుల ఖాళీలతో బలహీనపడు తున్నాయి. 'పరిశోధన'పై ప్రతికూల ప్రభావం ఏర్పడుతోంది.వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు.. అధ్యాపకులు లేకుండా ఎలా చదువుతున్నారు, ఎలా పరీక్షలు రాస్తున్నారు, ఎలా ఉత్తీర్ణులవుతున్నారు అనేదే పెద్ద ప్రశ్న. 'ప్రైవేట్ యూనివర్సిటీలు' ఆధునిక సదుపాయాలు కలిగివున్నప్పటికీ, అధిక ఫీజుల సామాన్య విద్యార్థులకు అందుబాటులో లేవు, వాటిలో రిజర్వేషన్ల అమలు లేదు. యూనివర్సిటీలకుఎన్ఐఆర్ఎఫ్ లో ప్రాంతీయ బలాలు కాపాడుతూ గ్లోబల్ ప్రమాణాలు సాధించడం సవాలుగా మారింది. 'స్కిల్ యూనివర్సిటీలు' స్థాపించడం ద్వారా, యువతకు నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ నైపుణ్యాధారిత విద్యా వ్యవస్థను బలపరచడానికి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ముందడుగు వేస్తున్నాయి. విద్యా అవకాశాలు విస్తరించినప్పటికీ నాణ్యతలో అసమా నత పెరుగుతోంది. దీన్ని అధిగమించడానికి కేంద్ర,రాష్ట్ర సమన్వయం, స్థిరమైన నిధుల కేటాయింపు, నైపుణ్య ఆధారిత విద్యా విధానం, పరిశోధన ప్రోత్సాహం అత్యవసరం. విద్య-ఉద్యోగ అనుసంధాన లోపంతో ఇవి కేవలం నిరుద్యోగులను ఉత్పత్తి చేసే కర్మాగారాలుగానే మిగిలిపోతున్నాయనడంలో సందేహం లేదు.సాంకేతికత ఆధునిక ప్రపంచాన్ని వేగంగా మార్చుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బయోటెక్నాలజీ, డిజిటల్ గవర్నెన్స్, స్పేస్ రీసెర్చ్ వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిణామాలను సమర్థవంతంగా నడిపే సాధనం 'శక్తివంతమైన విద్యా విధానం'. ప్రస్తుత పరీక్షా వ్యవస్థ, మార్కులు, ర్యాంకులపై ఆధారపడటం, విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను అణచి, 'పట్టా ఉన్నా ఉద్యోగం లేని' పరిస్థితిని సృష్టిస్తోంది. సమాచార యుగంలో ఉపాధి అవకాశాలు, అంతర్జాతీయ అధ్యాపక మార్పిడి, శాస్త్ర,సాంకేతిక నైపుణ్యాలు అత్యవసరం. పాఠశాల స్థాయిలో బలమైన శాస్త్ర విద్య, నైపుణ్యాధారిత బోధన, అనుభవాత్మక పాఠ్య ప్రణాళిక అవసరం. డిజిటల్, ఇన్నోవేషన్ కోర్సులు, ఆన్లైన్ లెర్నింగ్ గ్రామీణ విద్యార్థులకు కొత్త అవకాశాలను ఇస్తాయి.స్థిరమైన ప్రగతికి మౌలిక వనరుల పెంపు, ఆధునిక సిలబస్, పరిశోధన ప్రోత్సాహం, నైపుణ్య ఆధారిత కోర్సులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, గ్రీన్ ఎనర్జీ, హెల్త్ టెక్నాలజీ వంటి రంగాలను తప్పనిసరిగా చేరవేయాలి. యూనివర్సిటీలలో 'పారిశ్రామిక విభాగాలు' స్థాపించడం ద్వారా విద్య,ఉద్యోగ అనుసంధానం బలపడుతుంది. పాలన, ఆర్థిక సామర్థ్యం ఆధారంగా రాష్ట్రాల సంస్కరణల్లో వైవిధ్యం కొనసాగుతోంది. రాష్ట్ర యూనివర్సిటీలకు ప్రత్యేక బ్లాక్ గ్రాంట్లు, ప్రైవేట్ యూనివర్సిటీలలో 'ఫీజుల నియంత్రణ కమిషన్' ఏర్పాట్లు అవసరం. విద్యను శక్తివంతమైన సాధనంగా మార్చి, ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు కల్పించడానికి, అన్ని రాష్ట్రాలు ప్రత్యేకంగా విప్లవాత్మక మార్గదర్శిగా, అధికారిక పత్రంగా 'నూతన విద్యా విధాన పత్రం'లను రూపొందించుకోవడం అత్యవసరం.

# గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ సందర్శించిన డిసిపి

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించింది లేదు

: పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని పోలీస్ స్టేషన్ ను డీసీపీ భూక్యా రామ్ రెడ్డి సందర్శించారు. పెద్దపల్లి జోన్ డీసీపీ గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తోలిసారిగా గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలోని గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సందర్శించిన డీసీపీ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ సెంటర్ సందర్శించి రికార్డులు పరిశీలించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ ఫిర్యాదుల సమస్య సత్వర పరిష్కారం కి కృషి చేస్తూ బాధితులకు పోలీసులు పై నమ్మకం భరోసా కలిగే విధంగా వ్యవహరించాలి అని సూచించారు. అనంతరం స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను డిసిపి ఇన్స్పెక్టర్ను అడిగి తెలుసుకోవడంతో పాటు, స్టేషన్ పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయి. స్టేషన్ పరిధిలో ఎన్నిసెక్టార్లు వున్నాయి, సెక్టార్వారిగా ఎస్.ఐలు నిర్వహిస్తున్న విధులు, వారి పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు వారి ప్రస్తుత స్థితి గతులను సంబంధిత సెక్టార్ ఎస్.ఐలని అడిగి తెలుసుకున్నారు. గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి క్రయ విక్రయాలపై స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మత్తు పదార్థాల నియంత్రణకై నిరంతరం పనిచేయాలని నేరాల నియంత్రణకై విజుబుల్ పోలీసింగ్ అవసర మని, ఇందుకొసం పట్టణంలో నిరంతం పోలీసులు పెట్రొలింగ్ నిర్వహించాలని స్టేషన్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ వెంట గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, సీఐ ఇంద్రసేన రెడ్డి, ఎస్ఐ భీమేష్, రమేష్, అనూష, ఉన్నారు.

## గోదావరిఖని ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించిన నూతన డీసీపీ




**అగ్ని ధార న్యూస్ ( రామగుండం):** పెద్దపల్లి జోన్ గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతా, నేరా నియంత్రణ చర్యలు, ప్రజలతో పోలీసింగ్ పనితీరు, ప్రజా సేవల అమలు విధానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు నూతనంగా నియమితులైన డీసీపీ సోమవారం రోజున ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. సబ్ డివిజన్ పరిధి స్టేషన్ ల వారీగా నేర గణాంకాలు, భద్రత చర్యలు, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించారు.

## ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉండాలని భక్తి భావంతో మెలగాలని కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్, ఎల్ హెచ్ పి హెచ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్ అన్నారు. సోమవారం కడ్తాల్ మండలంలోని మైసిగండి శివాలయంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇరుముడి కార్యక్రమానికి స్థానిక నాయకులతో కలిసి జైపాల్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దశరథ్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావంతో వెలిగినప్పుడే ధర్మం నిలబడుతుందని తెలిపారు. ధర్మాన్ని పాటించేవారు తప్పనిసరిగా భక్తి భావంతోనే మెలుగుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జైపాల్ నాయక్ మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్ భిక్య నాయక్ మాజీ ఎంపిటిసి ప్రియా రమేష్ నాయకులు పాండు నాయక్ భిక్య నాయక్ రాజు జానియా జగన్ నాయక్ నాగార్జున అయ్యప్ప స్వాములు ఆంజనేయ స్వాములు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## కత్తెర్ల శ్రీ కుందన కు నివాళులు అర్పించిన ఆవుల రాజేష్ యాదవ్



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని** సోమవారం రోజున ధర్మారం మండలం బోట్ల వనపర్తి గ్రామంలో కత్తర్ల లక్ష్మణ్ భూదేవి యాదవ్ కూతురు ఐదు రోజుల క్రితం మేనమామ వివాహానికి వెళ్లి వస్తుండగా కాసులపల్లి శివారులో బైక్ స్కిడ్ అయి కింద పడటంతో శ్రీ కుందన అక్కడికక్కడే మృతి చెందడంజరిగింది .సోమవారం రోజున దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని శ్రీకుందన జ్ఞాపకాలను స్మరించు కుంటూ చిత్రపటానికి,పూలమాలతో నివాళులు అర్పించడం జరిగింది.అనంతరం అఖిల భారత యాదవ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల రాజేష్ యాదవ్ మాట్లాడుతూ. శ్రీ కుందన యాదవ్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పాడు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని ఆ భగవంతుని వేడుకున్నారు ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు కొమ్ము కుమార్ యాదవ్, దాడి సది యాదవ్,సంధనేని కొమురయ్య యాదవ్, కత్తెర్ల రాజేష్ యాదవ్, కుమార్ యాదవ్, కుటుంబ సభ్యులు కత్తర్లలక్ష్మణ్ యాదవ్ కుమార్ యాదవ్, లస్మయ్య ఓదెలు, ఐలయ్య దంపతులు కుటుంబ సభ్యులు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# సమాజంలో ప్రతి ఒక్కరూ సేవ భక్తి మార్గంలో నడుచుకోవాలి

## దేవాలయ నిర్మాణానికి 1.16 లక్షలు రూపాయలు అందజేత

## ఆలయ కమిటీ సభ్యులకు అందజేసిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జూపల్లి భాస్కర్ రావు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**చారకొండ మండలంలోని జేపల్లి గ్రామంలో నిర్మిస్తున్న శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయ పునర్నిర్మాణ అభివృద్ధికి వెల్దండ సింగిల్ విండో చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జూపల్లి భాస్కర్ రావు రూ. 1.16 లక్షలు 1లక్ష 16వేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భాస్కర్ రావును శాలువతో ఘనంగా సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నృపాల్ నాయక్, ఎర్రవల్లి మాజీ సర్పంచ్ సాయి కుమార్, మాజీ వార్డు సభ్యులు వెలిజాల వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు పోలీస్ వెంకట య్య, కిరణం షాపు వెంకటయ్య, లైన్ మెన్లు వెంకటయ్య, శ్రీనివాసులు ఆర్టీసీ సైదులు, రమేష్, పరుశురాం, నరేందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

**విగ్రహా ఆవిష్కరనలో పాల్గొన్న ఎంపీ మల్లురవి ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎంపీ మల్లురవి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తో కలిసి ఆవిష్కరించారు అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఎంపీ మల్లురవి మాట్లాడుతూ. ప్రపంచంలో యుద్ధాలతో సాధించలేనిది కేవలం జ్ఞానంతో రాజ్యాంగాన్ని సాధించిన మొదటి వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని అన్నారు అంబేద్కర్ తండ్రికి వచ్చిన చిన్న ఆలోచన ఆయనను ప్రపంచ జ్ఞానిగా తీర్చిదిద్దేలా చేసింది అని తెలిపారు అణిచివేత చిన్న చూపుకు గురైన అంబేద్కర్ ప్రపంచ దేశాలకు వెళ్లి ఎవరు సాధించలేని చదువులు చదివి భారతదేశానికి వచ్చి రాజ్యాంగాన్ని రచించి అన్ని వర్గాల మన్ననలు పొందారు అని ఆయన అన్నారు ఎమ్మెల్యే మాట్లాడుతూ. ఏ వర్గానికైనా అంబేద్కర్ జీవిత పాఠాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఈ దేశంలో ప్రతి వారికి కావలసిన వ్యక్తి అంబేద్కర్ అని ఒక వర్గం కులానికి కాదని అందరికోసం రాజ్యాంగాన్ని రచించిన అహ మేధావి అని ఆయన కొనియాడారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్ నాయక్,సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, సంజీవ్ యాదవ్,భూపతి రెడ్డి,లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు శంకర్ నాయక్, పుల్లయ్య భరత్ గౌడ్, అంబేద్కర్ యువజన సబ్యులు నరసింహ రాజు ఆంజనేయులు మహేష్, శ్రీకాంత్,చంటి, మండల నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

## ప్రకృతి మనకు ఇచ్చిన వరం ఔషధ మొక్కలు

**ఔషధ మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత**

**ప్రధానోపాధ్యాయుడు సిహెచ్ వెంకటరమణ**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలం లోని మార్చాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ మరియు పాఠశాల విద్యాశాఖ తెలంగాణ వారి ఆధ్వర్యంలో 100కు పైగా ఔషధ మొక్కలు నాటడం జరిగింది. చెట్టమ్మ డిక్లరేషన్ ఇంకుడు గుంత కంపోస్ట్ పిట్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పుడమి మాస పత్రిక సంపాదకులు రమేష్ రావు మాట్లాడుతూ ప్రకృతిలోని ప్రతి మొక్క ఔషధ గుణాలను కలిగి ఉంటుందని ప్రకృతి మనకి ఇచ్చిన వరం ఔషధ మొక్కలని వాటిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కరోనా కష్టకాలంలో ఈ ఔషధ మొక్కలు ప్రాణాధారమైనదని ఈ పాఠశాలలో షుగర్ క్యాన్సర్ లివర్ చర్మ సంబంధమైన వ్యాధుల నివారణకు ఉపయోగించే మొక్కలను నాటడం జరిగిందని వీటిని విద్యార్థులు ఉపాధ్యాయులు సమన్వయంతో కాపాడుకోవాలని కోరారు ఈ పాఠశాల ప్లాస్టిక్ ఫ్రీ పాఠశాలగా ఎదగాలని ప్లాస్టిక్ ను ప్రోత్సహించరాదని కోరారు పర్యావరణ కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యతని గుర్తు చేశారు గ్రీన్ రెవల్యూషన్ రాష్ట్ర బాధ్యులు రఫీ ఉద్దీన్ ప్రతి మొక్క గురించి వాటి ఔషధ గుణాల గురించి వివరించడం జరిగింది వా ఈ కార్యక్రమంలో గ్రీన్ రెవల్యూషన్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీ మద్దిలేటి పాఠశాల ప్రధానోపాధ్యాయులుచ వి సి హెచ్ వెంకటరమణ పాఠశాల ఉపాధ్యాయులు శ్రీమతి శ్రీలత శ్రీనివాసులు ఆనంద్ కుమార్ రెడ్డి గోపాల్, శ్రీమతి ప్రసన్న రామకృష్ణ జయపాల్ నరసింహ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## వనపర్తి సాహితీ వేత్తలకు కురుమూర్తి దేవస్థానంలో సన్మానం






**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** వివిధ సాహితీ కళారంగాల్లో ప్రతిభ కనబరిచిన వనపర్తి ప్రముఖులను కురుమూర్తి దేవస్థానంలో ఆదివారం ఘనంగా సన్మానించారు.సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, శిల్పి సాహితీవేత్త బైరోజు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు చెన్న పద్మ, సువర్ణాదేవి, కూచిపూడి నర్తకి చైత్రారెడ్డి (పక్షాన తండ్రి పవన్కుమార్రెడ్డి)లకు ఆలయ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఈఓ మదనేశ్వర్ రెడ్డి సత్కారం అందజేశారు. ప్రతీ సంవత్సరం బ్రహ్మోత్సవాల్లో ప్రతిభా వంతులైన కళాకారులను సన్మానించడం ఆనవాయితీగా జరుగుతుందని చైర్మన్ తెలిపారు. సాహితీవేత్తలు కందూరు నారాయణ రెడ్డి, బిచ్చయ్య, కొత్తకాపు నారాయణరెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## బిలినీయర్స్ అంతా ఒక్కచోట!

అసాధ్యం అనుకున్న చాలా విషయాలను ఏఐ సాధ్యం చేస్తోంది. టెక్ బిలియనీర్లు అందరూ ఒక్క చోటకు చేరిన ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఏఐ చేసిన ఈ అద్భుతంపై.. నెట్టింట్లో మీమ్స్, జోకులు వెల్లువెత్తుతున్నాయి. 1 ట్రిలియన్ స్క్వాడ్ పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలో.. ఎలాన్ మస్క్, మార్క్ జుకర్బర్గ్, సుందర్ పిచాయ్, జెన్సెన్ హువాంగ్, సామ్ ఆల్ట్మాన్, టిమ్ కుక్, జెఫ్ బెజోస్లు అందరూ ఒకేచోట ఉన్నారు.

# ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలంలోని దేవకి గార్డెన్ లో మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల తో కలిసి అందజేసిన కల్వకుర్తి శాసన సభ్యులు కసి రెడ్డి నారాయణరెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుంది అని చెప్పారు, తలకొండపల్లి మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చి దిద్దుతాను అని చెప్పారు, త్వరలోనే వెల్జాల గ్రామానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేస్తున్నామని చెప్పడం జరిగింది మరియు 11 సంవత్సరాలు దేశ ప్రధానిగా పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, భూములు పంచడంతోపాటు అనేక సంస్కరణలు చేపట్టిన ఉక్కు మహిళ, మాజీ ప్రధాని, భారతరత్న శ్రీమతి ఇందిరా గాంధీ పేరుపైన తెలంగాణలోని 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలను తెలంగాణ ప్రజా ప్రభుత్వం అందజేస్తుంది అని తెలిపారు. తెలంగాణ ఆడపడుచులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారే కానుక అందజేసినందుకు వారికి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యటా గీత నరసింహ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి సీనియర్ నాయకుడు శతాబ్ది టౌన్షిప్ చైర్మన్ కాసు శ్రీనివాస్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి , పి.సి.సి కిసాన్ సెల్ కార్యదర్శి డి .మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు పార్టీ అనుబంధ సంఘల అధ్యక్షులు, అధికారులు మహిళ సోదరీమణులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## లిక్కర్ రాణి దందాలే కాదు దౌర్జన్యాలు కూడానా..

**ఈనాడే అర్థమైంది-మాజీమంత్రి నిరంజన్ రెడ్డి.**



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** తెలంగాణ అస్తిత్వం అంటే పట్టుచీరలు గోల్డ్ వాచీలు కాదని,ఇన్ని రోజులు లిక్కర్రానికి దందాలు చెందాలు మాత్రమే తెలుసు అనుకున్నాను కానీఈనాడు దౌర్జన్యం కూడా చేయడం నేర్చుకుందని సోమవారం ప్రెస్ మీట్ లో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. టీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వనపర్తి జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో కవితపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగంపై పూర్తిగా విఫలమైందని, ఇప్పటివరకు 720 మంది రైతులు ప్రాణాలు తీసుకోవడం దుర్ఘటన అని అన్నారు.

**పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్:**

పది శాతం పనులు పూర్తి చేస్తేనే నీళ్లు వచ్చే పరిస్థితి ఉన్నా సీఎం రేవంత్ స్పందించడం లేదని విమర్శించారు.

**వ్యక్తిగత ఆరోపణలపై స్పందన:**

తనపై కవిత చేసిన ఆరోపణలు అసత్యమని, “నేను ఎప్పుడూ పల్లెటూరి భాషలో కవితను విమర్శించలేదు కావాలనే సోషల్ మీడియాలో నాపై కబుర్లు పుట్టిస్తున్నారు” అన్నారు. నాకు విలాసవంతమైన ఫామ్హౌజ్లు లేవు స్వగ్రామంలో ఒకే ఒక వ్యవసాయ క్షేత్రం ఉంది. నీకు హైదరాబాద్, గండిపేట ఫామ్హౌజ్లు ఎక్కడివి?” అని ప్రశ్నించారు. “కెసిఆర్ కూతురవు గనుక గౌరవిస్తున్నాం కానీ ఆ గౌరవాన్ని కాపాడుకోలేదు. మేము పార్టీకి వన్నె తెస్తుంటే నువ్వు నేతలను మానసికంగా వేధిస్తున్నావు” అని ఆయన తీవ్రంగా విమర్శించారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట వరం

**చెక్కు అందజేసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండా మండలంతెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా పేద మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణ కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో తోడ్పాటు నందిస్తుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.వెల్దండా మండలం అంకమోనీకుంట గ్రామానికి చెందిన సంజయ్ రెడ్డి తండ్రి శ్రీనివాస్ రెడ్డి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం సోమవారం గోలి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన 37,500రూపాయల ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కును అందించారు. కార్యక్రమంలో వెల్దండ మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్,కలకొండ మాజీ సర్పంచ్ పవన్ కుమార్, వెల్దండా మాజీ ఉప సర్పంచ్ నిరంజన్, తలకొండపల్లి టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఏ ఏం సి డైరెక్టర్ సుభాష్, రాజు తదితరులు పాల్గొన్నారు

## వర్షాలతో దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు

**పనులు ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు**

వెల్దండ మండలంలోని బండోని పల్లి గ్రామం నుండి గుండాల వరకు మట్టి రోడ్డు పనులను ప్రారంభించిన స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎనుముల శేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది అన్నారు వర్షాలకు దెబ్బతిన్న మట్టి రోడ్డు విషయం ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి దృష్టికి తీసుకోగా వెంటనే స్పందించడం జరిగింది అని పనులను జెసిబి సహాయంతో చదును చేయడం జరిగింది అని వారు అన్నారు పాటు గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేయడం జరుగుతుంది అని వారు అన్నారు ఈ కార్యక్రమంలో ఎనుముల శేఖర్ రెడ్డి, ఉమాపతి రుద్ర రవి కృష్ణయ్య తిరుపతి తిరుపతయ్య గోవర్ధన్ రెడ్డి అర్జున్ జంగయ్య పర్వతాలు తదితరులు పాల్గొన్నారు

## వనపర్తి జిల్లా నూతన ఎస్పీగా సునిత బాధ్యతలు స్వీకరణ

**మహిళలు పిల్లల భద్రత, డ్రగ్స్ రహిత వనపర్తి లక్ష్యం**



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** వనపర్తి జిల్లా నూతన ఎస్పీగా డి. సునిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డీఎస్పీ వెంకటేశ్వరరావు పూదోట అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ గౌరవ వందనం స్వీకరించి అధికారికంగా పదవీ బాధ్యతలు చేపట్టారు.

**ఎస్పీ సునిత మాట్లాడుతూ**

ప్రజలకు చేరువగా ఉండే పారదర్శక పోలీసింగ్ అమలు చేస్తామని డ్రగ్స్, అవినీతి, అనైతిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని మహిళలు పిల్లల రక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ డ్రైవింగ్, ఓవర్‌స్పీడింగ్‌పై జీరో టోలరెన్స్ అమలు చేస్తామని, హెల్మెట్ సీట్‌బెల్ట్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్, ప్రమోషన్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజా ఫిర్యాదులకు 24/7 స్పందన అందిస్తామని తెలిపారు.వనపర్తిని భద్రతా పరంగా ఆదర్శ జిల్లాగా మార్చడం పోలీసుశాఖ లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.

## బాలిక అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు



**అగ్నిధారన్యూస్"( సంగారెడ్డి)"** కూలిపనికి వచ్చిన బాలిక అదృశ్యం అయిన సంఘటన సోమవారం సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం చెర్ల రాయిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది స్థానిక ఎస్సై చైతన్య కిరణ్ వివరాలను వెల్లడిస్తూ కర్నూల్ జిల్లా దేవన కొండ మండలం కోటకొండ(పి) గ్రామానికి చెందిన తెలుగు సుంకన్న(ముదిరాజ్) కూలీపని చేస్తూ జీవనం సాగిస్తున్నారు, కూలీపనిలో భాగంగా రాయికోడ్ మండలం చెర్ల రాయిపల్లి గ్రామానికి చెందిన బయమ్మోళ్ల రాములు పొలంలో పత్తి ని తీయడానికి నెల రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి టెంట్ వేసుకుని నివసిస్తున్నారు,రోజులాగే ఆదివారం కూడా పొలంలో పత్తి ని తీసి వచ్చి తమ టెంట్ లో కుటుంబ సభ్యులు అందరూ భోజనం చేసి పడుకున్నారు,సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు లేచి చూడగా తమ చిన్న కూతురు తెలుగు శిరీష(16) కనిపించలేదు దింతో టెంటు చుట్టుపక్కల,చెర్ల రాయిపల్లి గ్రామంలో వెతికిన,గ్రామంలోని వారికి బంధువులకు చరవాణి ద్వారా విచారించగా ఆచూకీ తెలియక పోవడంతో తెలుగు సుంకన్న పోలీస్ స్టేషన్లో కంప్లెయింట్ ఇవ్వగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చైతన్య కిరణ్ తెలిపారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం





**ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలంలోని తర్నికల్ గ్రామం, బచ్చలకూర గెలవమ్మ తోటపల్లి గ్రామానికి చెందిన ఆయిల దశరథం అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయాన్ని గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ రెండు గ్రామాల మృతుల కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తాళ్ళ సురేష్ గౌడ్, కంపిల్లా భీమ్,దారమోని గణేష్, మాజీ ఎంపిటిసి రవీందర్ రెడ్డి వర్కర్ల దేవయ్య ఐలా శేఖర్ గౌడ్ ఈశ్వరయ్య వెంకటయ్య మల్లేష్, రత్నం, కృష్ణయ్య, దేవయ్య గోపాల్ మల్లయ్య మల్లేష్ సంజీవ్,పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## సమాజ అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం

**కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** సమాజ అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల యొక్క పనితీరు వెలకట్టలేనిదని కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో మహిళా అభ్యున్నతికి అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుంకు బాలచంద్ర స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 3 నెలల ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన సుమారు 40 మంది మహిళలు ప్రదర్శించిన వృత్తి నైపుణ్య ముగింపు కార్యక్రమంలో లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా స్వయం సమృద్ధి వైపు ప్రోత్సహించే దిశగా స్వచ్ఛంద సేవా సంస్థల పనితీరు అభినందనీయమని అన్నారు. నిరుపేద మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కృషి చేస్తున్న అభయ ఫౌండేషన్ రాష్ట్ర వ్యాప్తంగా తన సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తోందని, వారి సేవలు అభినందనీయమని అన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు ప్రాథమిక కుట్టు నైపుణ్యాల నుండి అడ్వాన్స్‌డ్ టైలరింగ్ టెక్నిక్స్ వరకు ఆచరణాత్మక మైన శిక్షణ అందించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళలు మూడు నెలల పాటు శిక్షణ పొంది నేర్చుకున్న పనితీరును మరియు కుట్టిన వస్త్రాలను పరిశీలించి అభినందించారు. శిక్షణను పూర్తి చేసిన తరువాత, మహిళలు స్వంతంగా చిన్న వ్యాపారం ప్రారంభించేందుకు సహాయపడాలన్న ఉద్దేశంతో సంస్థ సబ్సిడీపై అందించిన 36 కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.అనంతరం లక్ష్మీ నరసింహ్మా రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అందుకే స్వయం ఉపాధిని ప్రోత్సహించే ఈ ప్రాజెక్టులను నిరంతరం కొనసాగించడానికి ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కుట్టు మిషన్లను అందుకున్న మహిళలు అభయ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలియజేసినట్లు అన్నారు. సామాజిక సేవలో అడుగడుగునా కొత్త కార్యక్రమాలతో స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న సేవలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల ప్రశంసలు పొందుతున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అభయ ఫౌండేషన్ ఉమెన్ ఎంపవర్మెంట్ డైరెక్టర్ కృష్ణవేణి, కోఆర్డినేటర్ మంగ, టైలరింగ్ శిక్షకురాలు విజయ, కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్ బాబా మరియు స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## హిడ్మా ఎన్కౌంటర్ బూటకం

**సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేయాలి**

**: ప్రజా సంఘాలు**

**అగ్నిధార న్యూస్,(పెద్దపల్లి):**మారేడుమిల్లి రంపచోడవరం ఎన్కౌంటర్లు బూటకపు హత్యాకాండ అని ఆరోపిస్తూ, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో న్యాయ విచారణ జరపాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. రైతు కూలి సంఘం, ఏఐఎఫ్టీయూ, విరసం, టీపీఎఫ్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, ఫార్వర్డ్ బ్లాక్, టిఆర్పి సంయుక్తంగా పెద్దపల్లి బస్టాండ్ అమరవీరుల స్తూపం వద్ద నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ హిడ్మా సహా 12 మంది మావోయిస్టులను 14-15 నవంబర్ మధ్య అదుపులోకి తీసుకుని చిత్రహింసలు చేసి, 18-19 నవంబర్ తేదీల్లో 'ఎన్కౌంటర్'గా చూపించి హత్యచేశారని ఆరోపించారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఖనిజాల కోసం కార్పొరేట్ల ప్రయోజనాలకు అనుగుణంగా కగార్ ఆపరేషన్ పేరుతో హింస కొనసాగుతున్నదని అన్నారు.మావోయిస్ట్ పార్టీ శాంతి చర్చలకు సిద్ధమన్నా, కాల్పుల విరమణ ప్రకటించినా, ప్రభుత్వం యుద్ధవాతావరణాన్ని కొనసాగిస్తోందని ప్రజా సంఘాలు విమర్శించాయి.

**డిమాండ్లు:**




అన్ని ఎన్కౌంటర్లపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ
పాలుపంచుకున్న అధికారులపై హత్యా కేసులు
కగార్ ఆపరేషన్ నిలిపివేత
శాంతి చర్చలు పునరుద్ధరణ
సైనిక క్యాంపుల తొలగింపు, 5వ షెడ్యూల్ పెసా అమలు
నిర్బంధిత ఆదివాసీల విడుదల చేయాలని పలు డిమాండ్లతో ప్రదర్శన చేశారు

**ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు:** వెల్తురు సదానందం, టి రత్నకుమార్, కృష్ణ స్వామి, మామిడిపల్లి బాపయ్య, బాలసాని రాజయ్య, గుమ్మడి కొమురయ్య, గాండ్ల మల్లేశం, గుండవేనా స్వామి, రాంచంద్రం, బుద్ధుల రమేష్, సకినాల రవి, కోరేపు మల్లేష్, సాయి కుమార్. తదితరులు పాల్గొన్నారు

## ఆధ్యాత్మికంగా అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన ముద్విన్, మైసిగండి గ్రామాలు

**స్వార్థం వీడితే సంతోషం రెట్టింపు అవుతుంది**

**డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** మనుషులకు ఉన్న స్వార్థం వీడితే సంతోషం రెట్టింపు అవుతుందని డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. సోమవారం కడ్తాల మండలంలోని ముద్విన్, మైసిగండి గ్రామాలు ఆధ్యాత్మికత శోభను సంతరించుకున్నాయి. ముద్విన్ గ్రామంలో ఉన్న శ్రీ రామాలయంలో డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, కడ్తాల మాజీ సర్పంచ్ గూడూరులక్ష్మీనరసింహారెడ్డిలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా ముద్విన్ గ్రామంలో పట్నం శ్రీను గౌడ్ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి 18వ మెట్టు మహా పడిపూజ బ్రహ్మశ్రీ కుట్టన్ చంద్రమోహన్ నాయర్ గురుస్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా మైసిగండి శివాలయంలో కడ్తాల్ మాజీ వైస్ ఎంపీపీ బి. ఆనంద్ ఆధ్వర్యంలో ముకుంద గురుస్వామి ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి ఇరుముడి మహా పూజలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రెండు గ్రామాలు అయ్యప్ప నామస్మరణతో మార్మోగాయి.. అనంతరం గంప వెంకటేష్ గుప్తా, గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి అన్న ప్రసాదం ( బిక్ష) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు భీముడు, శ్రీశైలం, సైదులు, విజయ్, పి రామకృష్ణ, వెంకటేష్, నరేష్, మాదారం మహేష్ గౌడ్, మహేందర్ గౌడ్, గురు స్వామి నరసింహ గౌడ్ స్వామి, రమేష్ గౌడ్, నరసింహ గౌడ్, సురేష్ ముదిరాజ్, సన్నిధానం గురు స్వామి, హనుమాన్ యూత్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి గురుస్వామి, కే సత్యంచారి, శ్రీకాంత్, అమృతం పాండు స్వామి, ఆంజనేయులు, లాయక్ అలీ, జహంగీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

**- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** తెలంగాణ గ్రామాలన్నింటినీ అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. సోమవారం పెద్దమందడి మండలం చీకరుచెట్టు తండాలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే మేఘారెడ్డి గ్రామాల్లో ఆధునిక గ్రామపంచాయతీ కార్యాలయాల స్థాపనతో గ్రామ పాలన మరింత పారదర్శకంగా, నిరాటంకంగా కొనసాగుతుందని చెప్పారు. గ్రామాల అభివృద్ధి దేశ అభివృద్ధికి పునాది అవుతుందని పేర్కొన్నారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో గ్రామీణ ప్రాంతాలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని విమర్శించిన ఆయన, ఇందిరమ్మ రాజ్యం ప్రారంభమైన తర్వాత గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా, నిరాటంకంగా జరుగుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాధాకృష్ణ, మాజీ జెడ్పీటీసీ వెంకటస్వామి, రమేష్ గౌడ్, ఎంపీడీవో ప్రభుత్వాధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో వడ్డీ లేని రుణాల పంపిణీ

**కలెక్టర్ పి ప్రావీణ్య వెల్లడి**

**విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం**




**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు మంగళవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలలో వడ్డీ లేని రుణాలు అందించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. అన్ని నియోజకవర్గ కేంద్రాలలో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు , ఏం ఎల్ సి, ప్రజాప్రతినిధుల సమక్షంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఏకకాలంలో వడ్డీ లేని రుణాలు పండగ వాతావరణం లో పంపిణీ జరిగేలా విస్తృత ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం సచివాలయం నుండి మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు,సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, తదితరులతో కలిసి ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క ఇందిరమ్మ చీరల పంపిణీ, వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 25వ తేదీ మంగళవారం అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో వడ్డీ లేని రుణాలు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య , అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు) చంద్రశేఖర్, పి డి ఆర్ డి ఏ జ్యోతి, అదనపు డిఆర్డిఓ సూర్యారావు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా లో వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పై స్పష్టమైన ఆదేశాలను జారీ చేశారు. జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో వడ్డీ లేని రుణాల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులు ఆదేశించారు. రుణాల పంపిణీ కార్యక్రమాలను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని వారికి ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలోని 15926 స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.16.78 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను మంగళవారం అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలంగాణ ప్రభుత్వ అభిమతానికి వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా పండగ వాతావరణం లో జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే ఈ కార్యక్రమంలో మండల గ్రామ మహిళా సమాఖ్యల ప్రతినిధులు అందరూ హాజరయ్యాలా చూడాలన్నారు. వడ్డీ లేని రుణాల పంపిణీ ద్వారా వేలాదిమంది మహిళలకు ఆర్థిక భారం తగ్గి మరింత ఆత్మవిశ్వాసంతో ఆర్థిక అభివృద్ధి సాధనకు మార్గం సుగమం అవుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# గోదావరిఖని ప్రాంతం లో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చెయ్యాలి

**- జ్ఞానాన్ని సంపాదించడానికి కేంద్ర గ్రంథాలయం అవసరం**

**- మద్దెల దినేష్**




**అగ్నిధార గోదావరిఖని టౌన్ నవంబర్: 24** మైనింగ్ ప్రభావిత జిల్లాల అభివృద్ధికి కేటాయించిన డిఎంఎఫ్ నిధులతో పెద్దపల్లి జిల్లా గోదావరఖని పారిశ్రామిక ప్రాంతంలో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ కోరడం జరిగిందని తెలిపారు. అనంతరం మద్దెల దినేష్ మాట్లాడుతూ గనుల రంగంలో ప్రధాని మోదీ తీసుకొచ్చిన వివిధ సంస్కరణల కారణంగా ఏర్పాటైన జిల్లా ఖనిజ ఫౌండేషన్ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్-డీఎంఎఫ్) క్రింద మైనింగ్ కార్యకలాపాలు జరు గుతున్న 646 జిల్లాల్లో రూ. లక్ష కోట్ల నిధి జమ అయిందని, దీన్ని ఆయా జిల్లాల్లో మైనింగ్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి వాడుకోవచ్చని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి గతంలో పేర్కొన్నారని, కొన్ని రోజుల క్రింద ఢిల్లీలో జరిగిన డీఎంఎఫ్ వర్క్ షాప్ లో అభివృద్ధిలో వెనుకబడిన జిల్లాల కోసం ప్రత్యేకంగా 'యాస్పిరేషనల్ డీఎంఎఫ్ ప్రోగ్రాం' ప్రారంభించారని దేశవ్యాప్తంగా 112 ఆకాంక్షిత (యాస్పిరేషనల్) జిల్లాల్లోని 106 డీఎంఎఫ్ వద్ద రూ.32 వేల కోట్లున్నాయని, ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి ఈ నిధులతో ఆయా ప్రాంతాల అభివృద్ధికి జిల్లాల కలెక్టర్లు, ముఖ్య ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డీఎంఎఫ్ నిధులతో విస్తృతస్థాయిలో కార్యకలాపాలు జరుగుతు న్నాయని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సమన్వయంతో కలెక్టర్లు నిధులను వెచ్చిస్తే పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయి" వర్క్ షాప్ లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీశ్చంద్ర దూబే, గనులశాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావులతోపాటు 60 జిల్లాల కలెక్టర్లు, 160 మంది జిల్లాస్థాయి అధి కారులు, రాష్ట్రాల మైనింగ్ కార్యదర్శులు పాల్గొన్నారని తెలంగాణ రాష్ట్రం నుంచి ఇతర జిల్లాల కలెక్టర్లతో పాటు మన పెద్దపల్లి జిల్లా నుండి కలెక్టర్ కూడ పాల్గొనడం జరిగిందని, కావున డీఎంఎఫ్ నిధుల వినియోగంలో భాగంగా గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని అనేక సంవత్సరాల నుండి మా వంతుగా ప్రభుత్వాలకు, ప్రజా ప్రతినిధులకు, మరియు అధికారులకు విన్నవిస్తున్న పట్టించుకోకపోవడం బాధాకరమని, రామగుండం కార్పొరేషన్ లోని ప్రతి ఇంటి పన్ను నుండి 8% నిధులు సెస్ కి తరలిపోతున్నకాని ప్రభుత్వాలకు ఎలాంటి చలనం లేదని, సింగరేణి కార్మికుల కుటుంబాల పిల్లలకు మరియు ప్రభావిత ప్రాంతాల యువకులతో పాటు జిల్లాలోని యువతీ యువకులకు వివిధ రకాల ఉద్యోగాలకు శిక్షణ కోరకు ప్రయివేట్ కోచింగ్ సెంటర్లను ఆశ్రయించి ఆర్థికంగ నష్టపోతున్నారు. చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో" అన్నది సామాజిక సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పిన ఒక గొప్ప మాట. ఈ సూక్తి ద్వారా, మనం మెరుగైన వస్తువులను కాకుండా జ్ఞానాన్ని సంపాదించడానికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. జ్ఞానాన్ని సంపాదించడం అనేది బయటి ఆహార్యం కంటే ముఖ్యమని, పుస్తకాలు చదవడం ద్వారానే ఇది సాధ్యమవుతుందని అన్నారు. కావున గోదావరిఖనిలో యుద్ధ ప్రాతిపాదికన డిఎంఎఫ్ నిధులు కేటాయించి ప్రభుత్వ/సింగరేణి స్థల సేకరణ చేసి సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని దినేష్ డిమాండ్ చేసారు.

# ఇన్వెస్టర్లు జాగ్రత్తగా ఉండాల్సిన తరుణమిది..




గడిచిన వారమంతా బుల్ పరుగులే. నిఫ్టీ ఏకంగా 1.64 శాతం పెరగగా సెన్సెక్స్ 1.39 శాతం పెరిగింది. మరి ఈ వారం ఏమవుతుంది? ఇన్వెస్టర్లు ఏం చెయ్యాలి? వాస్తవానికి మార్కెట్లు ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిలకు దగ్గర్లో ఉన్నాయి. ఇన్వెస్టర్లు జాగ్రత్తగా ఉండాల్సిన తరుణమిది. అమెరికాతో వాణిజ్య చర్చలు కొన్నాళ్లుగా జరుగుతూనే ఉన్నాయి. ఎప్పటికప్పుడు ఈ వారంలో ట్రేడ్ డీల్ కుదిరే అవకాశం ఉందని వార్తలు వస్తూనే ఉన్నాయి. డీల్ మాత్రం కుదరటం లేదు. కుదిరినా అది మన వ్యవసాయ రక్షణలకు ప్రతికూలంగా నిలుస్తుందా? అలాంటి ఆందోళనలేవీ అవసరం లేని స్థాయిలో ఉంటుందా? అనేది తెలియదు. దీనికితోడు నవంబరు నెల ఎఫ్ అండ్ ఓ ఎక్స్‌పైరీ కూడా ఉంది. ఎక్స్‌పైరీ రోజుల్లో... అంటే మంగళవారం, గురువారం మార్కెట్లు తీవ్రమైన హెచ్చుతగ్గులు చూసే అవకాశముంది.

ప్రతికూల, అనుకూల అంశాలివీ...

దేశీయంగా...

ఈ ఏడాది (2025%-%26) రెండో త్రైమాసిక(జూలై%-%సెప్టెంబర్) జీడీపీ గణాంకాలు 28న వెలువడతాయి. ఏప్రిల్%-%జూన్(క్యూ1)లో దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం పురోగతి సాధించింది. ఇది గత ఐదు త్రైమాసికాలలోనే అత్యధికం. ఈ సారి గణాంకాలు ఎలా ఉంటాయో చూడాలి. అక్టోబర్ నెల పారిశ్రామికోత్పత్తి(ఐఐపీ) గణాంకాలు కూడా 28నే వెల్లడవుతాయి. సెప్టెంబర్‌లో ఐఐపీ 4% ఎగసింది. ఈసారీ ఆ స్థాయిలో ఉండొచ్చనే అంచనాలున్నాయి.

విదేశీ అంశాలు

కొద్ది రోజులుగా ఎఫ్ఐఐలు (విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు) దేశీ స్టాక్స్‌లో అమ్మకాలకే అధిక ప్రాధాన్యమిస్తున్నారు. కాకపోతే దేశీ ఫండ్లు కొనుగోళ్లు చేస్తుండటంతో మార్కెట్లు పెద్దగా పడటం లేదు. యూఎస్ మార్కెట్ల తీరు, అమెరికా, చైనా డేటాను గమనించాల్సి ఉంటుంది.

గత వారం రూపాయి విలువ డాలరుతో పోలిస్తే సరికొత్త ఆల్‌టైమ్ కనిష్టానికి (89.66) పతనమైంది. ఇది ప్రతికూలమే. ఈ వారం పతనం కొనసాగుతుందా? లేదా? చూడాలి...

**గమనించాల్సిన ప్రధాన షేర్లు...**

హెచ్‌డీఎఫ్‌సీ

డిపాజిట్లలో వృద్ధి వివరాలు వెల్లడవుతాయి. మార్జిన్లపై కంపెనీ వెల్లడించే వివరాలు అనుకూల ప్రభావాన్ని చూపించొచ్చు. క్విడిటీ బలహీనంగా ఉండటం... కాస్ట్ ఆఫ్ ఫండ్స్ వంటివి ప్రతికూలాంశాలు.

జేఎస్‌డబ్ల్యూ స్టీల్...

ఎగుమతులకు డిమాండ్ బాగుండి, స్టీల్ ధరలు పెరిగితే అది ఈ షేరుకు సానుకూలం.

స్టీల్ ధరలు పతనమై.. చైనా నుంచి డిమాండ్ బలహీనపడితే అది షేరుకు ప్రతికూలం

టీసీఎస్

రూపాయి ధర స్థిరంగా ఉండి, అమెరికా టెక్నాలజీ కంపెనీల ఫలితాలు బాగుంటే అది షేరుకు సానుకూలం.

అంతర్జాతీయ టెక్ కంపెనీలు వ్యయాన్ని తగ్గించుకుంటున్నట్లు ప్రకటిస్తే అది ప్రతికూలం.

హెచ్ఏఎల్

రక్షణ శాఖ నుంచి, ఎగుమతుల కోసం ఆర్డర్లు వచ్చే చాన్సుంది. విదేశీ భాగస్వామ్యాలపై కొత్త సమాచారం వెలువడితే అది సానుకూలం.

ప్రాజెక్టులను పూర్తి చేయటంలో, పేమెంట్లలో జాప్యం వార్తలు ప్రతికూలమనే చెప్పాలి.

సాంకేతికంగా..

ఈ వారం ఎన్ఎస్ఈ నిఫ్టీకి 26,200 పాయింట్ల వద్ద రెసిస్టెన్స్ ఎదురుకావచ్చు. ఈ స్థాయి దాటితే 26,350 వద్ద తదుపరి అమ్మకాల ఒత్తిడి కనిపించవచ్చు. నిఫ్టీ బలహీనపడితే 25,900 పాయింట్ల వద్ద తొలి సపోర్ట్ లభించవచ్చు. తదుపరి 25,850 పాయింట్ల వద్ద కొనుగోళ్ల మద్దతుకు వీలుంది.

## నేరస్థులు చట్టం నుండి తప్పించుకోలేరు: సిఐ



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"**సొసైటీలో శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని,అసాంఘిక కార్యకలాపాలు చట్టవ్యతిరేకమైన పనులు చేసే వారిపై పోలీసుల డేగ కన్ను ఉంటుందని జహీరాబాద్ గ్రామీణ వలయాధికారి జక్కుల హన్మంతు అన్నారు, సోమవారం పోలీసు స్టేషన్ ఆవరణలో పాత నేరస్థులను బైండోవర్ చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ రౌడిషీటర్లు ఎవరినైనా బెదిరించిన,అక్రమ వసూళ్లు పాల్పడిన శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వారిపై డీజీ,ఎస్పీల ఆదేశానుసారం చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోని జైలుకు పంపుతామని హెచ్చరించారు పోలీసుల విధులకు ఆటంకం కల్గించిన,అవమానించిన అవహేళన చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు సర్కిల్ లో మొత్తం 39 మంది రౌడిసీటర్ల ఉన్నారని వారందరికీ బైండోవర్ చేసి క్రమశిక్షణ రహిత కార్యకలాపాలు చేపడితే చర్యలు ఉంటాయని,వారందరిపై ఎప్పుడూ పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందని,ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా మసులుకోవాలనీ సూచించారు. కార్యక్రమంలో రాయికోడ్ ఎస్సై యం.చైతన్య కిరణ్,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వ్యక్తికి మూడు రోజులు జైలు శిక్ష




**అగ్నిధార గోదావరిఖని టౌన్ నవంబర్:24** గోదావరిఖని పట్టణం రామగుండం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధి లో ట్రాఫిక్ సిఐ బి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా 9 మంది పట్టు బడ్డారు వారినీ గోదావరిఖని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ముందు హాజరు పరిచారు వారి లో 8 మంది కి 16000 /- రూపాయలు జరిమానా విధించారు రెండోసారి పట్టుబడిన వ్యక్తికి 03 రోజులు జైలు శిక్ష విధించారు అనంతరం కరీంనగర్ జిల్లా జైలు తరలించారు

## మార్కెట్‌లోకి కొత్తగా రూ.5వేల నోటు రాబోతుందా.. కేంద్రం క్లారిటీ!




ఆర్బీఐ కొత్తగా రూ.5 వేల నోట్లను తీసుకురాబోతుందా.. కొద్దిరోజులుగా సోషల్‌మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ వార్తలపై తాజాగా కేంద్ర ప్రభుత్వం స్పందించింది. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఆ ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టంచేసింది. కొత్తగా రూ.5వేల నోట్లను తీసుకురావాలని ఆర్బీఐ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం సోమవారం సాయంత్రం ట్విట్టర్ (ఎక్స్) వేదికగా స్పష్టం చేసింది. ఆర్థిక అంశాలకు సంబంధించిన అధికారిక సమాచారం కోసం వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించింది. నకిలీ సమాచారం పట్ల అప్రమత్తంగా ఉండాలి, అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయవద్దని స్పష్టం చేసింది. ఏమైనా అనుమానాస్పద సమాచారం సర్క్యులేట్ అయితే సంబంధిత లింక్ లేదా ఫొటోను పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ వాట్సాప్ నంబర్ ౦91 8799711259కు లేదా పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ ద్వారా పంపించాలని సూచించింది.

## నలభై ఏళ్లలో కుర్రాడిలా.. రొనాల్డో బైస్కిల్ కిక్ వైరల్..!

ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో ఇప్పటికీ కుర్రాడిని తలపిస్తున్నాడు. మైదానంలో దిగితే గోల్స్ పండగే అన్నట్టుగా ఆడుతున్నాడీ సాకర్ వెటరన్. నలభై ఏళ్ల వయసులో అతడు చిరుతలా గోల్స్ వర్షం కురిపిస్తున్నాడు. సౌదీ అరేబియా క్లబ్ అల్ నస్రీ తరఫున చెలరేగిపోతున్న రొనాల్డో తాజాగా కళ్లు చెదిరే బైస్కిల్ కిక్ కొట్టాడు. సహచరుడు ఫార్వర్డ్ చేసిన బంతిని గాల్లోకి లేచి కుడికాలితో అమాంతం ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. ప్రస్తుతం అతడి సూపర్ గోల్ ఇంటర్నెట్‌లో వైరలవుతోంది. మూడేళ్ల క్రితం ఫిఫా వరల్డ్ కప్ తర్వాత అల్ నస్రీకి మారిన రొనాల్డో ఆ క్లబ్ గెలుపు గుర్రంగా అవతరించాడు. సౌదీ క్లబ్ విజయాల్లో కీలకం అవుతున్న ఈ ఫార్వర్డ్ ఆటగాడు.. నవంబర్ 23 ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మరోసారి తన మ్యాజిక్ చూపించాడు. రియాద్ వేదికగా 'అల్ అవ్వాల్' జట్టు డిఫెన్స్‌ను ఛేదించిన రొనాల్డో.. బైస్కిల్ కిక్ కొట్టాడు. అనంతరం తనదైన స్టయిల్లో సెలబ్రేట్ చేసుకున్నాడీ స్టార్ ప్లేయర్. అతడలా గోల్ చేయడంతో స్టాండ్స్‌లోని అభిమానులు ఉర్రూతలూగిపోయారు. టీవీ ప్రజెంటర్ అయితే ఆ బైస్కిల్ గోల్‌కు ఫిదా అయిపోయాడు. ఈ రోజు రాత్రి ఇంతకంటే గొప్ప విషయం మరొకటి ఉండదు. నా సహచరుడు రొనాల్డో మరో అద్భుతమైన బైస్కిల్ కిక్ సాధించాడు. అతడికి ఇప్పుడు 40. ఈ వయసులో కుర్రాడిలా రొనాల్డో చేసిన గోల్ నమ్మశక్యం కాదు అని పియెర్స్ మోర్గాన్ అన్నాడు. రొనాల్డో చేసిన ఈ గోల్ వచ్చే ఏడాది ఫిఫా పుస్కాస్ అవార్డుకు నామినేట్ అయ్యే అవకాశముందని విశ్లేషకులు అంటున్నారు. ఈ బైస్కిల్ గోల్‌తో రొనాల్డో వెయ్యి క్లబ్‌కు చేరువయ్యాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో 954 గోల్స్ ఉన్నాయి. ఇప్పటికే ఐదుసార్లు 'బాలన్ డీ ఓర్' అవార్డులు అందుకున్న ఈ దిగ్గజం.. వచ్చే ఏడాది ఫిఫా వరల్డ్ కప్ ఆడేందుకు సిద్ధమవుతున్నాడు.




## 'స్వయంభు' రిలీజ్.. బిగ్ యాక్షన్ వీడియోతో ప్రకటన

చాలారోజుల తర్వాత స్వయంభు సినిమా గురించి అప్‌డేట్ ఇచ్చారు. నిఖిల్ హీరోగా నటిస్తున్న ఈ మూవీని పాన్ ఇండియా రేంజ్‌లో దర్శకుడు భరత్ కృష్ణమాచారి తెరకెక్కిస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 13న ఈ మూవీని విడుదలచేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ క్రమంలోనే అదిరిపోయే రేంజ్‌లో ఒక వీడియోను షేర్ చేశారు. ఇందులో సంయుక్త, నభా నటేష్ హీరోయిన్లు. 'ఠాగూర్' మధు సమర్పణలో భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో లెజెండరీ వారియర్ క్యారెక్టర్‌లో నిఖిల్ కనిపించనున్నారు . 'బాహుబలి, ఆర్ఆర్ఆర్' వంటి భారీ చిత్రాలకు పని చేసిన సినిమాటోగ్రాఫర్ కేకే సెంథిల్ కుమార్ 'స్వయంభు'లో తన మ్యాజిక్ చూపించనున్నారు" అని యూనిట్ పేర్కొంది.

## ఫైనల్‌గా ఓటీటీలోకి రక్షిత్ శశివదనే.. ఇంతకీ ఏ ప్లాట్‌ఫాంలోనో తెలుసా..?





'పలాస 1978' సినిమాతో యాక్టర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు యువ హీరో రక్షిత్ ఈ యంగ్ హీరో నటించిన చిత్రాల్లో ఒకటి శశివదనే రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కోమలీ ప్రసాద్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించింది. ఈ ఏడాది అక్టోబర్ 10న థియేటర్లలో విడుదలైన శశివదనే బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయింది. ఇక ఓటీటీలో తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అయింది. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం సన్ నెక్ట్స్‌లో నవంబర్ 28న ప్రీమియర్ కానుంది. ఈ మూవీలో ప్రవీణ్ యెండమూరి, తమిళ నటుడు శ్రీమాన్, కన్నడ యాక్టర్ దీపక్ ప్రిన్స్, జబర్దస్త్ బాబీ కీలకపాత్రలు పోషించారు. గౌరీ నాయుడు సమర్పించిన ఈ చిత్రాన్ని ఎస్వీఎస్ కన్‌స్ట్రక్షన్స్, ఏజీ ఫిలిం కంపెనీతో కలిసి అహితేజ బెల్లంకొండ నిర్మించారు. మరి ఓటీటీలో ఎలాంటి స్పందన రాబట్టుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# డిసెంబరు 25న ప్రపంచవ్యాప్తంగా పతంగ్ సినిమా విడుదల



న్యూ టాలెంట్‌ను ఎంకరైజ్ చేయడంలో ఎప్పుడూ ముందుండే సురేష్ ప్రొడక్షన్స్ అధినేత, ప్రముఖ నిర్మాత డి.సురేష్ బాబు తాజాగా 'పతంగ్' చిత్ర టీమ్‌తో చేతులు కలిపారు. సురేష్ ప్రొడక్షన్స్ డి.సురేష్ బాబు సమర్పణలో ఈ చిత్రం డిసెంబరు 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇటీవల ఈ చిత్రంను ప్రత్యేక్షంగా వీక్షించి, చిత్ర టీమ్‌ను ప్రశంసించిన ఆయన 'పతంగ్' చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై తన సమర్పణలో చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నారు. పతంగుల పోటీతో రాబోతున్న ఈ కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్ పతాకంపై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడు. ఈ చిత్రంలో ఇన్‌స్టాగ్రమ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, జీ సరిగమప రన్నరప్ ప్రణవ్ కౌశిక్‌తో పాటు వంశీ పూజిత్ ముఖ్యతారలుగా నటిస్తున్నారు. మరికొంత మంది నూతన నటీనటులతో పాటు ప్రముఖ సింగర్, నటుడు ఎస్పీ చరణ్ ఈ చిత్రంలో కీలకమైన పాత్రలో కనిపించబోతున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, డి.సురేష్ బాబు సమర్పణలో ఈ చిత్రం డిసెంబరు 25న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ ' మా చిత్రానికి ప్రముఖ నిర్మాణ సంస్థ సురేష్ ప్రొడక్షన్స్, అభిరుచి గల నిర్మాత డి.సురేష్‌బాబు సమర్పణలో రిలీజ్ కానుండటం ఆనందంగా ఉంది. ఈ సినిమా థియేటర్‌లో యూత్‌ఫెస్టివల్‌లా వుంటుంది. కొత్తవాళ్లతో చేసిన మా సినిమా కొత్తగా వుండటంతో పాటు చాలా పెద్ద సినిమా క్వాలిటీతో వుంటుంది అన్నారు.

ఎంతో కలర్‌ఫుల్‌గా ఉండే ఈ సినిమాకు కథే హీరో. ఈ చిత్రానికి జోస్ జిమ్మి అద్భుతమైన పాటలు ఇచ్చాడు. పాట వింటూంటే అందరిలో పాజిటివ్ వైబ్స్ కలుగుతాయి. సినిమా చూస్తున్నంత సేపు ఆ పంతగుల పోటీ మీలో ఉత్సుకతను కలిగిస్తుంది. తప్పకుండా మా పతంగ్ చిత్రం అన్నివర్గాల వారిని అలరిస్తుందనే నమ్మకం వుంది. కొత్త కంటెంట్‌ను ఆదరించే తెలుగు ప్రేక్షకులు మా ప్రయత్నాన్ని తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం వుంది. డిసెంబరు 25న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అని తెలిపారు



## 'చికిరి చికిరి' స్టెప్‌కు ఊహించిన దానికంటే భారీ క్రేజ్ తాజాగా సరికొత్త రికార్డ్

రామ్ చరణ్ చేసిన చికిరి చికిరి స్టెప్ ఎంత పాపులర్ అయిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఎ.ఆర్. రెహమాన్ అందించిన సంగీతం, రామ్ చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్స్ కలిసివచ్చి ఈ పాటను సోషల్ మీడియాలో సునామీలా మార్చేశాయి. యూట్యూబ్‌లో కూడా ఈ పాట వ్యూస్ వేగంగా పెరుగుతూ 100 మిలియన్ మార్క్(10 కోట్ల) ను చేరుకుంది. 16 రోజుల్లో అన్ని భాషల్లో కలిపి ఈ రికార్డ్ సాధించినట్టు మేకర్స్ తెలియజేశారు. ఈ రికార్డ్ పట్ల మెగా ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక తెలుగు రాష్ట్రాలలోనే కాదు%ొ% ఉత్తర భారతదేశం, విదేశాల్లో ఉన్న సినీ అభిమానులు కూడా ఈ పాటకు ఫిదా అవుతున్నారు ఈ పాటకు వేసిన స్టెప్పులు, ముఖ్యంగా రామ్ చరణ్ చేసిన చికిరి స్టెప్, సాధారణ డ్యాన్స్ స్టెప్‌కంటే ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉందని నిపుణులు చెబుతుండటంతో మరోసారి పెద్ద చర్చకు దారితీసింది. ఈ స్టెప్ చేస్తూ కాళ్లు, చేతులు ఒకేసారి కదిలించటం వల్ల శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది అని వైద్య నిపుణులు అంటున్నారు. మెదడు మరియు శరీరానికి ఆక్సిజన్ సరఫరా సమానంగా జరుగుతుంది. హార్ట్ రేట్ నియంత్రణలో ఉండటంతో గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. లైట్ కార్డియో వర్కౌట్‌లానే పనిచేసి రోజువారీ శక్తిని పెంచుతుందని చెబుతున్నారు. జిమ్‌లలో కూడా ఇప్పుడు చాలామంది యువత చికిరి చికిరి స్టెప్స్ వేస్తూ తీసిన వీడియోలు షేర్ చేస్తుండటం ట్రెండ్ అయ్యింది. అయితే ఇది కూడా వ్యాయామం కాబట్టి, హెల్త్ ఇష్యూలు ఉన్నవారు తప్పకుండా వైద్యుల సలహా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ పాట కేవలం మ్యూజిక్ హిట్ కాదు%ొ% ఇప్పుడు ఫిట్‌నెస్ మూడ్‌ను కూడా సెట్ చేస్తోందని చెప్పాలి. ఇక మూవీ చిత్రీకరణ కూడా 60శాతం పూర్తయింది. మరోవైపు ప్రమోషన్స్‌ని కూడా వేగవంతం చేశారు.

## 'మహానటి' తర్వాత ఎవరూ ఛాన్స్‌లు ఇవ్వలేదు: కీర్తి సురేష్

'మహానటి' సినిమాలో తాను నటించినందుకు చాలా ట్రోల్స్ ఎదుర్కొన్నట్లు కీర్తి సురేష్ కొద్దిరోజుల క్రితం చెప్పారు. అయితే, తాజాగా మరోసారి ఇదే సినిమా గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కానీ, తాను వాటిని అధిగిమించానని ఆమె చెప్పింది. సావిత్రి పాత్రలో తాను నటించినందుకు ఎప్పటికీ గర్వపడుతున్నట్లు చెప్పారు. ఈ మూవీలో కీర్తి నటనకు గాను ఉత్తమ జాతీయ అవార్డ్ అందుకున్న విషయం తెలిసిందే. కీర్తి సురేష్ చాలా రోజుల తర్వాత వాల్వర్ రీటా మూవీతో మళ్లీ తెరపైకి వచ్చేస్తుంది. ఈ క్రమంలో తాజాగా మూవీ ప్రమోషన్ కార్యక్రమాలలో ఆమె పాల్గొంటుంది. ఆందులో ఆమె ఇలా చెప్పింది. 'మహానటి సినిమా తర్వాత దాదాపు ఆరు నెలల పాటు నాకు సినిమా ఛాన్సులు రాలేదు. కనీసం ఒక్క ప్రాజెక్ట్ కూడా రాకపోవడంతో ఇంట్లోనే ఉండిపోయాను. పరిశ్రమ నుంచి ఎవరూ కూడా నాకు కథ చెప్పడానికి ముందుకు రాలేదు. అయితే, మహానటి సినిమా చేసి నేను తప్పు చేశానని అనుకోలేదు. కొత్త ప్రాజెక్ట్‌లు రాలేదని నిరాశపడలేదు. మహానటి విజయం తర్వాత నా కోసం ప్రత్యేకమైన పాత్రలను క్రియేట్ చేసే పనిలో దర్శకనిర్మాతలు ఉన్నారేమో అనిపించింది.' అని ఆమె పేర్కొంది. ఇండియన్ సినిమా చరిత్రలో ఎప్పిటికీ మహానటి సినిమా ఉండిపోతుంది. కానీ, అలాంటి సినిమాలో నటించిన కీర్తి సురేష్‌కు మాత్రం చాన్స్‌లు రాలేదని చెప్పడంతో నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. మహానటి సినిమాను దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించారు. 2018లో విడుదలైన ఈ చిత్రం భారీ హిట్ అందుకుంది. 66వ భారత జాతీయ చలనచిత్ర పురస్కారాలలో ఉత్తమ తెలుగు సినిమా, జాతీయ ఉత్తమ నటి (కీర్తి సురేష్), జాతీయ ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ వంటి విభాగాల్లో అవార్డ్స్ అందుకుంది.



Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com